Follow: @ANNTELUGU

ANN తెలుగు

13-03-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్   సంపుటి- 22   సంచిక- 101   పేజీలు-08   వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## టెస్లా కారు కొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

మహా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టెస్లా కారు కొన్నారు. దాని ఓనర్ ఎలాన్ మస్క్ ను పక్కన కూర్చో పెట్టుకుని డ్రైవింగ్ కూడా చేశారు. మరోవైపు ట్రంప్ కోసం మస్క్ ఏకంగా ఐదు కార్లను వైట్ హౌస్ కు తీసుకుని వచ్చారు. అందులో ఒక రెడ్ కలర్ టెస్లా కారును ట్రంప్ కొన్నారు. కారు చాలా అందంగా ఉందని ట్రంప్ ప్రశంసించారు. మార్కెట్ ధరకే టెస్లా కార్ ను ట్రంప్ కొన్నారు. ఎలాన్ మస్క్ డిస్కౌంట్ ఇస్తానన్నా వద్దని చెప్పారు. ట్రంప్ టెస్లా కార్ కొనుగోలుతో ఆ కార్ మార్కెట్ భారీగా పెరుగుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. కొనుగోలుతో దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేశారు. అది కాస్తా ఇప్పుడు వైరల్ అయింది. ట్రంప్ ప్రభుత్వంలోని డోజ్ ను ఎలాన్ మస్క్ కు అప్పగించారు. మస్క్ నేతృత్వంలో డోజ్ శాఖ నిర్ణయాల వల్ల అమెరికాలో ఆయన మీద విపరీతమైన వ్యతిరేకత వస్తోంది. డోజ్ తీసుకున్న నిర్ణయాల వలన చాలా మంది ఉద్యోగాలు పోయాయి. దాంతో మస్క్ కంపెనీలు అయిన టెస్లా, ఎక్స్ లాంటి వాటి మీద తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అలాగే టెస్లా కారును బహిష్కరించాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగారు. ఎలాన్ మస్క్ కు మద్దుతుగా నిలిచారు. తానే స్వయంగా టెస్లా కార్ ను కొంటానని చెప్పారు. అన్నట్లుగానే ఈరోజు కారును కొన్నారు.

### టాప్ న్యూస్

**జగన్‌కు రాజకీయ భవిష్యత్ లేదు**

- ఆయన చుట్టూ కోటరీ ఉంది
- దానితోనే తీవ్ర నష్టం
- విజయ సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



02

**తెలుగుతో పాటు ఉర్దూ సినిమాలకి గద్దర్ అవార్డులు**

- ఏప్రిల్ లో అంగరంగ వైభవంగా వేడుక
- ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు



02

**కుల గణన పేరుతో బీసీలను కాంగ్రెస్ అవమానించింది**

- రాష్ట్రంలో ఒక్క బీసీ సంక్షేమ సంఘం మీ లెక్కలు సరైనవని అంటుందా?
- ఒక్క బీసీ బిడ్డ మీ లెక్కతో ఏకీభవిస్తున్నడా?
- మీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలైనా ఏకీభవించే పరిస్థితి ఉందా? : కేటీఆర్



03

# ప్రగతి పథంలో తెలంగాణ పరుగులు

## ప్రజలే కేంద్రంగా పాలన

### అన్ని వర్గాల వారికి అండగా ప్రభుత్వం

- విద్యతో పాటు ఉపాధికి పెద్ద పీట..రైతు సంక్షేమానికి ప్రాధాన్యం
- 15 మాసాల పాలనను ఆవిష్కరించిన గవర్నర్ ప్రసంగం
- సుస్థిర రాష్ట్ర రూపకల్పన దిశగా బడ్జెట్ ఉంటుందని వెల్లడి
- చేసిందే చెప్పడం ప్రభుత్వ విధానం
- అసెంబ్లీలో సాగిన గవర్నర్ ప్రసంగం ముఖ్యాంశాలు

**ఘనమైన సంస్కృతికి తెలంగాణా నిలయం**

**అవకాశాలు, అభివృద్ధి, సాధికారత మెండుగా ఉన్న రాష్ట్రం రానున్న రోజుల్లో మరింత ఉజ్వలంగా, ఆర్థిక అభివృద్ధి, సాంకేతిక విజ్ఞాన, సామాజిక న్యాయం లాంటి అంశాలలో దేశంలో అగ్రగామిగా నిలవబోతోందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. ఘనమైన సంస్కృతికి తెలంగాణా నిలయం అన్నారు. అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణా అడుగులు వేస్తుందని అన్నారు.**



**మహా:** ప్రజలే కేంద్రంగా రాష్ట్రంలో పాలన సాగుతుందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. దేశానికి దిక్సూచిగా, సమృద్ధ పురోగామి రాష్ట్ర నిర్మాణానికి నిబద్ధతతో అందరూ కలిసి ముందుకు సాగాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపు నిచ్చారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం గవర్నర్ ఉభయ సభల సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. గడచిన 15 మాసాలుగా రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై స్పృషించిన గవర్నర్ రాబోయే రోజులలో చేపట్టనున్న కార్యక్రమాలపై ప్రధనంగా ప్రస్తావించారు. ఈ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్ సమగ్ర స్వరూపాన్ని గవర్నర్ తన ప్రసంగంలో పస్పుటింప చేశారు.

**అన్ని వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం**

రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణా రాష్ట్రానికి రైతులే ఆత్మ అని, రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. వారి అభ్యున్నతికి ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతుల కోసం ఇప్పటికే అనేక కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. రైతు రుణ మాఫీ చేయడంతో పాటు సాగు ఖర్చుకు చేస్తున్న సహాయాన్ని ప్రస్తావించారు.

మిగతా 2లో

## ప్రతిపక్షాల విమర్శలు ధీటుగా ఎదుర్కోవాలి


### ప్రతి ఒక్కరూ సభకు రావాల్సిందే

మంత్రులు తప్పనిసరిగా సభలో ఉండాలి

సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



02



**దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయంపై**

## చెన్నైలో గర్జన

- లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనపై 22న చెన్నైలో కీలక సమావేశం

వివరాలు 2లో



## గవర్నర్ ప్రసంగం అంతా పూర్తి డొల్ల

### ఏవీ ఇవ్వకున్నా.. ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగం

**బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**మహా:** గవర్నర్ ప్రసంగం విజనరీ డాక్యుమెంట్‌గా ఉంటుందని ఆశించామని.. ప్రసంగమంతా పూర్తి డొల్ల అని అసెంబ్లీలో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. చేయని పనులు చేసినట్లుగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా జరిగిందనేది అవాస్తవం అన్నారు. ఏవీ ఇవ్వకున్నా.. అన్ని ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారన్నారు.



**బీజేపీ గెలిచిన తర్వాత ముస్లిం ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి**

## వెళ్లగొడతాం

### సువేందు అధికారి

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, బీజేపీ ఎమ్మెల్యే సువేందు అధికారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీజేపీ గెలిచిన తర్వాత ముస్లిం ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి వెళ్ళగొడతామని అన్నారు. బెంగాల్‌లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. స్పీకర్ కుర్చీని అవమానించారనే ఆరోపణలతో సువేందు అధికారితోపాటు బీజేపీ ఎమ్మెల్యేలను మార్చి 18 వరకు అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు.




# స్ట్రెచర్ అని విర్రవీగిన వాళ్లు స్ట్రెచర్ మీదకు వెళ్లారు

## వైఖరి మార్చుకోకుంటే మార్చురీలోకి వెళ్ళడం ఖాయం

### సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు..ఏడాదిలో 50వేల ఉద్యోగాలు ఇచ్చాం

### ఒక్క రూపాయి ఇంటికి తీసుకుపోను: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** స్ట్రెచర్ ఉందని విర్రవీగారు.. స్ట్రెచర్‌పై పడ్డారు. ఇకనైనా వైఖరి మార్చుకోవాలని.. లేకపోతే స్ట్రెచర్ నుంచి మార్చురీలోకి వెళ్లడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణకు జరిగిన అన్యాయం అంతా ఇంతా కాదు.. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందన్నారు. తమ ప్రభుత్వంలో విద్యాశాఖకు తొలి ప్రాధాన్యత ఇచ్చామని.. ప్రభుత్వ ఏర్పాటులో నిరుద్యోగుల కృషి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్, రవీంద్రభారతిలో జూనియర్ లెక్చరర్లకు సీఎం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. 1292 జూనియర్ లెక్చరర్స్, 240 పాలిటెక్నిక్ లెక్చరర్స్ పోస్టులకు సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. '12 ఏళ్ల మీ యుక్త వయస్సు వృథా అయ్యింది. నిరుద్యోగ సమస్య తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. తెలంగాణ వచ్చాక నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతోందని యువత భావించింది. మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. దేశ ఆర్థిక పురోగతి విద్యా రంగంతోనే సాధ్యం. విద్యారంగానికి రూ.21,650 నిధులు కేటాయించాం. ఇప్పటి వరకు 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

# మూలాలకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నాం

## సీఎం ప్రజావాణి సక్సెస్ రేటు 66 శాతం

### సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**మహా:** సమస్య మూలాలకు వెళ్లి ఆ సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తే సంపూర్ణ ఫలితం లభిస్తుందని, సీఎం ప్రజావాణిలో ఇదే తరహా పద్ధతిని తాము అనుసరిస్తున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ ది రోల్ అఫ్ ప్రజావాణి అండ్ ప్రజా పాలన ఇన్ తెలంగాణ అనే అంశంపై జరిగిన సింపోసియంలో చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మిగతా 2లో






## గంట ముందే అసెంబ్లీకి కేసీఆర్

**మహా :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగం సందర్భంగా బుధవారం అసెంబ్లీకి హాజరయ్యారు. అసెంబ్లీ వద్దకు చేరుకున్న కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలతో కేసీఆర్ దాదాపు అర గంట పాటు భేటీ అయ్యారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్ధేశం చేసినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో



## గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం లేదు

### ఎమ్మెల్సీ కవిత

**మహా:** గవర్నర్ ప్రసంగంలో కొత్తం ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా ? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం విఫలమవుతున్న నేపథ్యంలో గాంధీ కుటుంబం బాధ్యత తీసుకోవాలన్నారు. గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని.. స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదన్నారు.

## ఫైళ్లు దగ్ధం చేయగలరేమో కానీ నిజాల్ని చెరపలేరు

### హోంమంత్రి వంగలపూడి అనిత

- సీఐడీ దర్యాప్తు పూర్తికాగనే చర్యలు చేపడతాం
- మదనపల్లి ఫైళ్లదహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల హస్తం
- సీబీఐ దర్యాప్తులో విశాఖ ఓడరేవుకు కంటైనర్ల ద్వారా డ్రగ్స్ కేస

03



# ప్రగతి పథంలో తెలంగాణ పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

సమ్మిళితత్వం, స్వయం సమృద్ధి, సాధికారతతో కూడిన రాష్ట్రంగా ఆవిర్భవించాలన్న లక్ష్యంతో దార్శనికత, సాహసోపేత సంస్కరణలు, ప్రజా కేంద్రిత సుపరిపాలనతో సాకారం అవుతోందన్నారు.

**సుస్థిర రాష్ట్ర రూపకల్పనకు ప్రతీకగా బడ్జెట్**

రాష్ట్రం అసాధారణ రీతిలో పరివర్తనకి దగ్గరగా ఉందన్న గవర్నర్ సుస్థిర రాష్ట్ర రూపకల్పనకు ప్రతీకగా బడ్జెట్ ను అభివర్ణించారు. రాష్ట్ర పురోగతికి రోడ్డుమ్యాప్ గా, పౌరుల ఆకాంక్షలను నెరవేర్చేదిగా పేర్కొన్నారు. అలాంటి బడ్జెట్ సమావేశాలలో సభ్యులందరూ శ్రద్ధగా పాల్గోనాలని విజ్ఞప్తి చేశారు. పునరుత్పత్తి ఇంధనం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హైటెక్ పరిశ్రమలలో తెలంగాణని అగ్రగామిగా చేయడం ద్వారా తన ప్రభుత్వం సుస్థిరతతో పాటు పురోగతికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెట్టుబడులు పెంచటానికి ప్రభుత్వ చర్యలను వివరించిన గవర్నర్ ఏ1 సిటీ, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల సహకారంతో ఆర్థిక కార్యకలాపాలను పెంచడానికి, ఉపాధి అవకాశాల్ని మెరుగుపరచడానికి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటానికీ చర్యలు చేపట్టినట్లు గవర్నర్ చెప్పారు. ఈ దిశగా పెట్టుబడులు పెంచటానికి ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలను ఈ సందర్భంగా గవర్నర్ ఉటంకించారు. ప్రపంచం మత్తం తెలంగాణ వైపు చూస్తున్న వైనాన్ని గవర్నర్ గుర్తు చేశారు. స్వచ్ఛ హరిత ఇంధన పాలసీని ప్రకటించిన ప్రభుత్వం భవిష్యత్ ఇంధన డిమాండ్లను తీర్చడానికి పునరుత్పాదక రంగం, పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ లాంటి రంగాలలో వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. 2029 30 నాటికి రాష్ట్రంలో 6 వేల పైగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ దిశగా స్వచ్ఛ హరిత ఇంధన పాలసీని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ పథకానికి రాష్ట్రంలో వస్తున్న ఆధరణను గవర్నర్ పేర్కొన్నారు.

**సామాజిక న్యాయం అందించే దిశగా సర్కార్ యత్నం**

హరిత ఇంధనం, డేటా సెంటర్లు, ఆహార ప్రాసెసింగ్ ఎలక్ట్రానిక్ వాహనాలు రక్షణ తయారీ వంటి రంగాలలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు వెల్ల



డించారు. ఈ రంగంలో పెట్టుబడులను పెట్టేందుకు ప్రపంచంలోని దిగ్గజ సంస్థలు ముందుకు వచ్చాయని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ఆయా సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసి వస్తున్నాయని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయాన్ని అందించే దిశగా సర్కార్ యత్నం**

ప్రభుత్వం నిర్వహించిన సర్వే ఫలితాల ఆధారంగా వెనుకబడిన తరగతుల కోసం 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి ప్రభుత్వం ఒక బిల్లును ప్రతిపాదించిందని, దీనివల్ల బీసీ కులాలకు విద్యా, ఉపాధి, పాలనలో న్యాయోచిత వాటాను లభిస్తుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత కమిషన్ సిఫార్సుల ఆధారంగా షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కోసం కూడా బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటన్న గవర్నర్ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారతనివ్వటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలకు యువతకు సాధికారిక కల్పించే దిశగా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు.

**ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చెప్పిన గవర్నర్ మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటికే మహిళలకు 5500 కోట్ల రూపాయల మేర ప్రయాణపు ఖర్చులను మిగిల్చినట్లు వెల్లడించారు. 200 యూనిట్ల వరకు విద్యుత్తును వినియోగిస్తున్న 50 లక్షల పేద కుటుంబాలకు గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తును అందిస్తున్నామన్నారు. ఇంకా 43 లక్షల కుటుంబాలకు ఎల్ పీజీ సిలిండర్ ను 500 రూపాయలకే అందిస్తూ 433 కోట్ల రూపాయల రాయితీని కల్పించినట్లు వివరించారు. రైతులకు ఆర్థిక భద్రతకు ప్రభుత్వ చర్యలు వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మహిళలు నిర్వహిస్తున్న ఎస్ హెచ్ జీ లకే ప్రత్యేకించినట్లు పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భద్రత కల్పించేలా 25 లక్షల మందికి పైగా రైతులకు పంట రుణాలను మాఫీ చేసినట్లు గుర్తు చేశారు. రైతు భరోసా పథకం కింద అందిస్తున్న ఆర్థిక సాయం 12 వేల రూపాయలకు పెంచినట్లు, అలాగే భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఏటా 12 వేల రూపాయల సాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజల కలలు సాకారం చేసేలా బడ్జెట్ రాష్ట్ర ప్రజల కలలు సాకారం కావడం కోసం ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెడుతోందని ఆయన పేర్కొన్నారు.




# స్ట్రెచర్ అని విర్రవీగిన వాళ్లు స్ట్రెచర్ మీదకు వెళ్లారు

(మొదటిపేజీ తరువాయి)


'ఒక కుటుంబంలో ఉద్యోగం వస్తే వారి భవిష్యత్తు తరాలలో కూడా మార్పు వస్తుంది. విద్యలో తెలంగాణ చిట్ట చివరి నుంచి మూడో స్థానంలో ఉంది. ఇది ఆందోళనకరం, అవమానకరం. 25 ఏళ్ల లోకి ఉద్యోగం చేరాల్సింది.. 35 ఏళ్లు వచ్చే వరకు ఉద్యోగంలోకి చేరుతున్నారు. ఈ నష్టం మీది కాదు. తెలంగాణకు జరిగిన నష్టం ఇది. మా ప్రభుత్వంలో విద్యాశాఖకు మా ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యత ఇచ్చాం. ప్రభుత్వ ఏర్పాటులో నిరుద్యోగుల కృషి ఉంది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కన్నారు. 'ఇంతకుముందు న్యాయస్థానాల్లో ఏళ్లుగా కేసులు వాయిదా పడుతూ వచ్చాయి. న్యాయ స్థానాల్లో చిక్కుముడులు విప్పుకుంటూ ఉద్యోగాలు ఇచ్చే ప్రయత్నం చేశాం. 55 రోజుల్లో ఉపాధ్యాయ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చాం. రాష్ట్రంలో అన్ని కలిపి 29,500 స్కూళ్లు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. ప్రమాణాలు పడిపోతున్నాయి. రెసిడెన్షియల్ స్కూల్స్ లో విద్యార్థులకు రూ.40 వేలు ఖర్చు చేస్తున్నాం. విద్యార్థులు



ఎందుకు చేరడం లేదు. అంతా దీనిపై ఆలోచించాలి. ప్రపంచంతో పోటీ పడాలంటే చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం కూడా ఉండాలి' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను నిర్మించబోతున్నాం. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించాం. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేసుకుంటున్నాం. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోంది. క్రికెట్ లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలు సడలించి ఉద్యోగం ఇచ్చాం. బాక్సింగ్ లో రాణించిన నిఖత్ జరీన్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించాం. పారాలింపిక్స్ లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతో పాటు ఉద్యోగం ఇచ్చాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయంపై
# చెన్నైలో గర్జన

- లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనపై 22న చెన్నైలో కీలక సమావేశం





**మహా:** లోక్ సభ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అంశంపై చెన్నైలో ఈ నెల 22వ తేదీన డీఎంకే నేతృత్వంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడులను ఆహ్వానించనున్నారు. ఏపీ, తెలంగాణతో పాటు కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించనున్నారు. ఇందుకోసం తమిళనాడు మంత్రులతో కూడిన బృందం బయలుదేరింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజు జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ను తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా, ఎంపీ దయానిధి మారన్‌తో కూడిన బృందం కలిసింది. ఈ నెల 22న జరిగే సమావేశాలకు నవీన్ పట్నాయక్‌ను ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ తరపున లేఖను అందించింది. ఈ భేటీకి ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను తమిళనాడు మంత్రుల బృందం నేరుగా కలిసి ఆహ్వానిస్తోంది. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్ సభలో ప్రాతినిధ్యం తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కీలక పార్టీల ప్రతినిధులతో చెన్నైలో సమావేశం జరగనుంది.

# జగన్‌కు రాజకీయ భవిష్యత్ లేదు

## ఆయన చుట్టూ కోటరీ ఉంది.. దానితోనే తీవ్ర నష్టం

### విజయ సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**మహా:** వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ చుట్టూ కోటరీ ఉందని.. దాంతో ఆయనకు తీవ్ర నష్టం జరుగుతుందని, దాని నుంచి బయటపడకపోతే రాజకీయ భవిష్యత్ ఉండదని ఆ పార్టీ మాజీ నేత విజయ సాయిరెడ్డి అన్నారు. కాకినాడ పోర్టులో వాటాలను అక్రమంగా బదిలీ చేయించుకున్నారనే కేసులో విజయవాడ సీఐజీ రీజనల్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. విచారణ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీలో తనను ఎదగకుండా కొందరు కిందకు లాగారని ఆరోపించారు. తన మనసులో జగన్‌కు సుస్థిరమైన స్థానం ఉందన్నారు. జగన మనసులో మాత్రం తనకు స్థానం లేదని.. అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానన్నారు. కోటరీ కారణంగానే తాను జగన్‌కు దూరమయ్యానని చెప్పుకొచ్చారు.

**విరిగిన మనసు మళ్ళీ అతకదు**

కోటరీ మాటలు వినొద్దని తాను జగన్‌కు చెప్పానని.. భవిష్యత్‌లో మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లే అవకాశం లేదన్నారు. విరిగిన మనసు మళ్లీ అతుక్కోదని.. ప్రస్తుతం తాను ఏ పార్టీలో చేరాలనేదానిపై నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. నాయకుడనే వ్యక్తి చెప్పుడు మాటలు వినొద్దని.. అలాంటి వ్యక్తి నాయకుడే కాదన్నారు. ప్రజలు, పార్టీకి నష్టపోకతప్పదని.. తనకు, జగన్‌కు మధ్య కొందరు విభేదాలు సృష్టించారన్నారు. కోటరీకి అనుకూలంగా ఉంటేనే జగన్ వద్దకు తీసుకెళ్తారని.. జగన్ వద్దకు వెళ్లాలంటే కోటరీకి లాభం చేకూర్చాల్సిందేనన్నారు. పార్టీ నుంచి బయటకు వచ్చినా జగన్ బాగుండాలని తాను కోరుకుంటున్నా



నని విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు. ఎవరు నిజాలు చెబుతున్నారో.. ఎవరు అబద్ధాలు చెబుతున్నారో అర్థం చేసుకొని.. కోటరీ నుంచి బయటపడాలన్నారు. జగన్‌తో మాట్లాడిన సందర్భంలోనూ ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పినట్లు గుర్తు చేశారు. తనకు పార్టీలో అని పదవులు ఇచ్చారని.. దాన్ని కాదనడం లేదని, కానీ తనను ఎన్నో విధాలా అవమానించారని, కష్టపెట్టారని వాపోయారు. పార్టీలో ఉండాలని జగన్ కోరినా తాను అందుకు ఒప్పుకోలేదన్నారు.

**బదిలీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ సుబ్బారెడ్డి తనయుడే..**

కాకినాడ పోర్టుల బదిలీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ అన్నీ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డేనని విజయ సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. తనకు ఈ కేసులో సంబంధం లేదన్నారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి విక్రాంత్ రెడ్డి.. సుబ్బారెడ్డి తనయుడిగానే విక్రాంత్ రెడ్డి తనకు తెలుసని సీఐడీ అధికారులకు చెప్పినట్లు తెలిపారు. కామన్ ఫ్రెండ్ ద్వారా కేవీ రావును విక్రాంత్ రెడ్డికి పరిచయం చేశానని.. పోర్టు యజమాని కేవీరావుతో తనకు ఎలాంటి లావాదేవీలు జరుగలేదన్నారు. జగన్‌ను కాపాడేందుకు మీరంతా ప్రయత్నిస్తున్నారా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించారని.. ఈ కేసుతో జగన్‌కు సంబంధం లేదని చెప్పానన్నారు. కేవీ రావుకు, వైవీ సుబ్బారెడ్డికి మంచి సాన్నిహిత్యం ఉందన్నారు.

**ఇప్పుడు దేవుడిపైనే భక్తి**

సుబ్బారెడ్డి అమెరికాకు ఎప్పుడు వెళ్లినా కాలిఫోర్నియాలో కేవీ రావుకు చెందిన ఓ రాజభవనంలో ఉండేవారని. పోర్టు వ్యవహారంతో జగన్‌కు ఏమాత్రం సంబంధం లేదని.. ఇది రాజకీయ ప్రేరేపితమైన కేసు అని స్పష్టం చేశారు. ఆది నుంచి అంతం వరకు పోర్టు వాటాల వ్యవహారాన్ని డీల్ చేసింది విక్రాంత్ రెడ్డేనని.. కామన్ ఫ్రెండ్స్‌తో కేవీ రావు చెప్పారన్నారు. ఈ వ్యవహారం గురించి తనకు పూర్తి అవగాహన ఉందని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానన్నారు. కేవీ రావు రాజకీయ బ్రోకర్ అని.. ఆయనంటే తనకు అసహ్యమన్నారు. తాను వ్యవసాయం చేసుకుంటున్నానని.. ఇప్పుడు అదే పనిలో ఉన్నానన్నారు. గతంలో నాయకుడిపై భక్తి ఉండేదని.. ప్రస్తుతం దేవుడిపై భక్తి ఉందని చెప్పారు. తాను ప్రలోభాలకు లొంగిపోయానని జగన్ అన్నారని.. తాను ప్రలోభాలకు లొంగలేదన్నారు. భవిష్యత్‌లో తనపై విమర్శలు, ఆరోపణలు చేసినా పట్టించుకోనని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

# మూలాలకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నాం

## సీఎం ప్రజావాణి సక్సెస్ రేటు 66 శాతం

### సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి అధికారులు, సిబ్బంది అంకితభావంతో బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ప్రజావాణి ఇప్పటి వరకు 110 వారాలు పూర్తి చేసుకుందని, ఇప్పటివరకు 92,072 దరఖాస్తు వచ్చాయని, అందులో వివిధ సమస్యలపై 53,303 దరఖాస్తులు రాగా అందులో 35,001 దరఖాస్తులను పరిష్కరించినట్లు చిన్నారెడ్డి వివరించారు. దరఖాస్తులు సక్సెస్ రేటు 66% ఉందని తెలిపారు. మిగతా 38,769 దరఖాస్తులు వివిధ పథకాల కోసం రావడంతో వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులకు పంపినట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు. సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని ప్రజావాణికి వెళితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజల్లో విశ్వాసం కలుగుతోందని ఇది కదా ప్రజాపాలన అని చిన్నారెడ్డి అన్నారు. దరఖాస్థులలో ఎక్కువ శాతం ఇళ్ల కోసం, రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం వస్తున్నాయని, ధరణి లోపాలపై కూడా చాలా దరఖాస్తులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావాణిలో పకడ్బందీగా సిస్టం ఏర్పాటు చేశామని, శాఖల వారీగా డెస్క్ ఆఫీసర్స్, నోడల్ ఆఫీసర్స్, స్టేట్ నోడల్ ఆఫీసర్, ఆన్లైన్ ద్వారా ఆయా శాఖలకు దరఖాస్థులు పంపించి మానిటరింగ్ చేసే డెస్క్, ట్రాకింగ్ డెస్క్ వ్యవస్థ పనిచేస్తోందని చిన్నా




రెడ్డి వివరించారు. ధరఖాస్థులు తాము స్వీకరించడమే కాకుండా వాటిపై ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లేడుతున్నామని చిన్నారెడ్డి తెలిపారు. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సీఎం ప్రజావాణిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో క్షేత్ర స్థాయిలోనే సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోనున్నట్లు దివ్య పేర్కొన్నారు. హైడ్రా కమీషనర్ వీ. రంగనాధ్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, నాలాలను చెరబట్టిన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగిస్తున్నామని, ప్రభుత్వ భూములు, ఆస్తులను కబ్జా చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ హెడ్ కెప్టెన్ లింగాల పాండురంగా రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# గంట ముందే అసెంబ్లీకి కేసీఆర్




(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు కేసీఆర్ సూచించినట్లు సమాచారం. కొంతకాలంగా శాసనసభ సమావేశాలకు దూరంగా ఉంటున్న కేసీఆర్ గంట ముందే అసెంబ్లీకి రావడం గమనార్హం. బీఆర్ఎస్ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చివరి బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీకి హాజరైన సంగతి తెలిసిందే. మళ్లీ అప్పటి నుంచి అసెంబ్లీకి హాజరుకాకపోవడం గమనార్హం. తాజాగా ఇప్పుడు మళ్లీ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నన్ని రోజులు కేసీఆర్ సభకు వస్తారా లేక మరోసారి బడ్జెట్ ప్రసంగం రోజు వస్తారా అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రతిపక్షాల విమర్శలు ధీటుగా ఎదుర్కోవాలి

- ప్రతి ఒక్కరూ సభకు రావాల్సిందే
- మంత్రులు తప్పనిసరిగా సభలో ఉండాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్

**హైదరాబాద్:** 'మొదటి సారి ఎన్నికల్లో గెలవడం గొప్పకాదు.. రెండో సారి గెలవడం గొప్ప'అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు. ఈ బడ్జెట్ సమావేశాలు అత్యంత కీలకమైనవి. 15 నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉంది. ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలి. సభ్యులు ఖచ్చితంగా సభకు రావాల్సిందే. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండాలి. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సమావేశం అవుతా.

**6 నుండి జిల్లాల వారీ లంచ్ మీటింగ్ లు**

వచ్చే నెల 6 నుండి జిల్లాల వారిగా జిల్లా ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు,ఎంపీలు ,ఇతర ప్రజాప్రతినిధులతో లంచ్ మీటింగ్‌లు పెట్టుకుందాం. స్థానిక సమస్యలు, ఇతర అంశాలపై చర్చిద్దాం. మంత్రుల నియోజవర్గాలకు ఎక్కువ నిధులు వెళ్తున్నాయి అనే భావన చాలా మందిలో ఉంది. ఈ బడ్జెట్ సమావేశం లో అలా జరగదు.ఎమ్మెల్యేలందరికీ సమానంగా నిధులు ఇస్తాం.మొదటి సారి గెలవడం పెద్ద విషయం కాదు.రెండవసారి గెలవడం గొప్ప విషయం.మంత్రులు తప్పనిసరిగా హౌస్‌లో




ఉండాలి.మొక్కుబడిగా హాజరుకావడం మంచిది కాదు'అని సూచించారు

# మల్లన్న చుట్టూ హరీష్ ఫాలోవర్స్

## కేసీఆర్ వ్యూహమా?

### తెలంగాణ వాదాన్ని వదిలి బీసీ నినాదం వైపు బీఆర్ఎస్



**మహా :** తెలంగాణలో ప్రాంతీయవాదం ముగిసి కులవాదం పడక విప్పడంతో, ఇప్పుడు అన్ని పార్టీల్లోనూ బీసీ నినాదం బాగా వినిపిస్తోంది. 2028 తెలంగాణ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో తెలంగాణలో బీసీ కులాల నాయకులకు డిమాండ్ పెరుగుతోంది. బీసీ నినాదం ఎత్తుకొని రెడ్లను, కాంగ్రెస్ నేతలను నానా బూతులు తిట్టిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ను ఆకట్టుకునే పనిలో పడింది బిఆర్ఎస్.

ఈ విషయంలో చాలా వేగంగా పావులు కదిపిన కెసిఆర్, హరీష్ రావు ద్వారా మల్లన్న చుట్టూ కొందరు బిఆర్ఎస్ బీసీలను ప్రవేశపెట్టారు. తద్వారా మూడు ఏళ్ల ముందే చింతపండు నవీన్ ని ఫిక్స్ చేసే వ్యూహం పన్నింది బిఆర్ఎస్ పార్టీ.ఎవరు మాటలెక్కువ మాట్లాడగలుగుతారో, ఎవరు మాటలతో ప్రత్యర్థుల్ని చీల్చి చెండాడగలుగుతారో వాళ్లే తెలంగాణలో రాజకీయం చేయగలుగుతారు. మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండదు. నాయకుడు అనే వాడు ఏం చేసినా చేయకపోయినా అద్భుతంగా మాట్లాడితే చాలు తెలంగాణలో పొలిటికల్ లీడర్ గా సెటిలైపోవచ్చు. కెసిఆర్ అడ్వాంటేజ్ కూడా అదే. అద్భుతమైన మాటకారి అయిన చంద్రశేఖర రావు ఆ మాటలతోనే ఉద్యమం నడిపాడు, ఆ మాటలతోనే పదేళ్లు పాలన చేశాడు. ఇదే ఫార్ములా ఫాలో అయ్యి రేవంత్ రెడ్డి కూడా టిడిపి నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యాడు. చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న మీడియాలో ఓ చిన్న ఉద్యోగాన్ని వదులుకొని ఈ నోరు పెట్టుకునే ఏకంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ కూడా అయ్యాడు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమికి పది కారణాల్లో తీన్మార్ మల్లన్న కూడా ఒకడు. కెసిఆర్ కుటుంబంపై మల్లన్న నెగిటివ్ ప్రచారం ఎన్నికల్లో కాంగ్రెస్ కి చాలా ఉపయోగపడింది. అప్పటి పిసిసి అధ్యక్షుడు, ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా మల్లన్నకు ఫండింగ్ చేసి, ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి నిత్యం కెసిఆర్ ని తిట్టిస్తూ ఉండేవారు. ఈ విషయం కాంగ్రెస్ పార్టీ నేతలే చెప్తున్నారు. తీన్మార్ మల్లన్న అనే అనామకుడి కి అన్ని రకాలుగా సహకరించి ఎమ్మెల్సీ స్థాయికి తీసుకొచ్చింది రేవంత్ రెడ్డి.ఎమ్మెల్సీ అయ్యాక చింతపండు నవీన్ కాంగ్రెస్ కి అడ్డం తిరిగాడు. బీసీ నినాదం ఎత్తుకొని రెడ్లను నానా బూతులు తిట్టడం మొదలెట్టాడు. ఇప్పుడు కాంగ్రెస్ లో చాలామంది రేవంత్ ని నిందిస్తున్నారు. తీన్మార్ మల్లన్న అనే వాడిని తయారు చేసింది రేవంత్. ఇప్పుడు అతనే కాంగ్రెస్ పరువు తీస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తీన్మార్ మల్లన్నపై దాడులు చేయించి, కేసులు పెట్టించి, జైల్లో వేసి నా నా రకాలుగా హింసించిన కేసీఆర్ ఇప్పుడు హఠాత్తుగా వ్యూహం మార్చాడు. చింతపండు నవీన్ కాంగ్రెస్ కి అడ్డం తిరగగానే.... అతన్ని తన వైపు లాక్కోవాలని నిర్ణయించాడు కేసీఆర్.ఆ పనిని హరీష్ రావుకు అప్పజెప్పాడు. హరీష్ రావు అనుచరుల్లో కొందరు బీసీలు వెంటనే మల్లన్న చెంతకు చేరారు. తెలంగాణలో ఇక ప్రత్యేక రాష్ట్ర వాదన పనిచేయదని, ఆంధ్రా వాళ్ళని తిట్టి తెలంగాణలో ఓట్లు వేయించుకునే ప్లాన్ ఇప్పుడు ఇక వర్క్ అవుట్ కాదని, రాబోయే రోజుల్లో జనాన్ని కులం పేరిట డివైడ్ చేయాల్సిన అవసరం ఉందని, అందుకే బీసీ నినాదం ఎత్తుకోవడం ద్వారా జనాభాలో అత్యధికంగా ఉన్న వారి ఓట్లను కొల్లగొట్టాలని పార్టీలు డిసైడ్ అయ్యాయి. దీనిలో భాగంగానే హరీష్ రావు అనుచరులు కొందరు తెలివిగా మల్లన్న పక్కన చేరారు. ఒకప్పుడు కెసిఆర్ ఆఫీసులో పనిచేస్తూ అవినీతి ఆరోపణలపై గెంటి వేయబడిన ఒక బి ఆర్ ఎస్ బీసీ కార్యకర్త ఏకంగా ఇప్పుడు మల్లన్న పక్కన చేరాడు.అతనితోపాటు మరికొందరు బీసీ మాస్క్ తో తీన్మార్ మల్లన్న నీ కవర్ చేస్తున్నారు. అలాగే చింతపండు నవీన్ మూమెంట్స్ అన్ని ఎప్పటికప్పుడు హరీష్ రావుకు చేరవేస్తున్నారు. బీసీ ఉద్యమానికి కావలసిన నిధులు సమీకరించడం, ఇతరత్రా సహకారం బి ఆర్ ఎస్ ద్వారానే అందుతోంది. నవీన్ పక్కనబి ఆర్ఎస్ కార్యకర్తలు, హరీష్ రావు అనుచరులను చూసి తెలంగాణ బీసీ నాయకులు షాక్ తిన్నారు. పదేళ్ల కెసిఆర్ కుటుంబ పాలన్నీ, కెసిఆర్ అవినీతిని ఎండగట్టి.. ఆ కేసుల్లో జైలు కెళ్ళి... చివరికి మల్లన్న ఇలా వాళ్లతోనే చేతులు కలవడం చూసి ఆశ్చర్యపోతున్నారు. బీసీ సభలకు, ఇతరత్రా కార్య కలాపాలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఇప్పుడు అర్థమైంది .కాంగ్రెస్ కి వ్యతిరేకంగా కెసిఆర్ ఈసారి బీసీలను రెచ్చగొట్టి.... మల్లన్న ద్వారానే ఆ పని చేయిస్తున్నాడనేది చాలామంది చర్చించుకుంటున్నారు. ఏ ఆయుధాన్ని అయితే రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కేసీఆర్ పై ప్రయోగించాడో, అదే ఆయుధాన్ని ఇప్పుడు కేసీఆర్ కాంగ్రెస్ పై ప్రధానంగా రేవంత్ రెడ్డి పై ప్రయోగించబోతున్నారు. తీన్మార్ మల్లన్న రేవంత్ ఉచ్చు నుంచి బయటపడి కెసిఆర్ ఉచ్చులో చిక్కుకున్నాడు.

# శ్రీ చైతన్య అక్రమాల్లో అధికారుల పాత్ర ఎంత?

## అక్రమాల వెనుక అధికారుల గుట్టు రట్టు!

వరుస అక్రమాలకు మూసివుంచిన కళ్లు – అధికారుల మౌన అనుమతి?

వరుస ఆత్మహత్యలు జరిగినా పట్టించుకోని పాలక వ్యవస్థ

తల్లిదండ్రుల ఫిర్యాదులను పక్కనబెట్టిన యంత్రాంగం

ప్రభుత్వం కోసం ఒక సాఫ్ట్‌వేర్ – విద్యార్థుల కోసం మరో సాఫ్ట్‌వేర్!

వేలకోట్ల టోకరా – ఐటీ చెల్లింపుల్లో లెక్కల గోల్‌మాల్




**ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొంటుందా, లేక మౌనం కొనసాగిస్తుందా?**

**విద్యార్థుల భవిష్యత్తు నాశనం కావడం చూడలేక తల్లిదండ్రులు పోరాటం చేస్తున్నారు. కానీ, ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఇంకా మౌనంగానే ఉంది. తల్లిదండ్రుల ఫిర్యాదులు పట్టించుకోవాలి. ఈ స్కామ్ వెనుక ఉన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు సమర్పించిన వారిని విచారించాలి. విద్యను వ్యాపారంగా మార్చిన వారిపై ప్రభుత్వం ఎప్పుడు కఠిన చర్యలు తీసుకుంటుంది? విద్యార్థుల భవిష్యత్తును దోచుకుంటున్న కార్పొరేట్ వ్యవస్థను నిలువరించాలంటే ప్రజలే పోరాటం చేయాలా?**

**ఖమ్మం మహా:** తెలంగాణలో కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలు కొత్తదేం కావు. కానీ, విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి, ప్రభుత్వాన్ని మోసం చేసి, వేల కోట్ల రూపాయల దోపిడీ చేయడం నేటి పరిస్థితిలో తారాస్థాయికి చేరింది. శ్రీ చైతన్య గ్రూప్ తాజాగా వెలుగులోకి వచ్చిన స్కామ్ ఈ వ్యవస్థలోని బాగోతాన్ని మరోసారి బయటపెట్టింది. విద్యార్థుల పట్ల అమానవీయంగా వ్యవహరిస్తూ, తల్లిదండ్రులను బలవంతంగా డబ్బు కట్టించే ఈ విధానంపై ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాలనే డిమాండ్ పెరుగుతోంది. వరుస ఆత్మహత్యలు, ఐటీ దాడుల్లో బయటపడిన డబుల్ సాఫ్ట్‌వేర్ స్కామ్ వంటి అంశాలు శ్రీ చైతన్య యాజమాన్యంపై తీవ్రమైన ఆరోపణలకు కారణమయ్యాయి. కానీ, ఇంతటి భారీ అక్రమాల వెనుక ఉన్న అసలైన చేతులు ఎవరివి? ఎందుకు ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటి వరకు మౌనంగా ఉంది? ఈ స్కామ్‌పై ఎప్పుడు కఠిన చర్యలు తీసుకుంటారు?

**వరుస విద్యార్థుల ఆత్మహత్యలు – నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం.**

తెలంగాణలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై నిత్యం ఒత్తిడిని పెంచుతూనే ఉన్నాయి. పరీక్షల ఒత్తిడి, ఫీజుల భారంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, విద్యాసంస్థలు మాత్రం కనీసం బాధ్యత వహించేందుకు కూడా సిద్ధంగా లేవు. శ్రీ చైతన్యలో ఈ ఘటనలు మితిమీరిపోతున్నాయి. ఇటీవలే జరిగిన వరుస ఆత్మహత్యలు విద్యాసంస్థలలో నెలకొన్న అమానవీయతకు నిదర్శనం. విద్యార్థులపై నెలల తరబడి ఒత్తిడి పెంచి, చివరకు మానసిక కుంగుబాటుకు దారి తీసే విధంగా వ్యవహరిస్తున్న ఈ వ్యవస్థపై ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదు?

**తల్లిదండ్రుల కన్నీళ్లకు ప్రభుత్వం ఎందుకు స్పందించదు?**

విద్యార్థుల పరిస్థితిని చూసి తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకుంటున్నా, ప్రభుత్వం మాత్రం వీటిని పట్టించుకునే ఉద్దేశ్యంతో లేదు. నెలకు వేలాది రూపాయలు ఫీజుల పేరుతో వసూలు చేసి, ఆర్థికంగా తల్లిదండ్రులను నష్టపరిచే విధంగా కార్పొరేట్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఇది కేవలం ఓ విద్యాసంస్థ మాత్రమే అనుకోవడం పొరపాటు. విద్యా రంగాన్ని సంపాదన యంత్రంగా మార్చిన సంస్థలు ఈ అక్రమాలకు తెరలేపాయి.

**వేల కోట్ల స్కామ్ – ఐటీ దాడుల్లో సంచలన నిజాలు బయటకు**

ఇటీవల శ్రీ చైతన్య గ్రూప్‌పై ఐటీ శాఖ జరిపిన దాడుల్లో సంచలన నిజాలు బయటపడ్డాయి. కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలు, అవకతవకల లెక్కలు, గుట్టుచప్పుడు కాకుండా నడిపిన అక్రమ లావాదేవీలు—all these point towards a wellplanned scam.
ప్రభుత్వాన్ని మోసం చేయడమే కాదు, తల్లిదండ్రులకు కూడా తప్పుదోవ పట్టించేలా శ్రీ చైతన్య యాజమాన్యం వ్యవహరించిన తీరు బయటపడింది. ఫీజుల లెక్కలు మార్చి చూపించడం, తక్కువ ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు సమర్పించడం వంటి అంశాలు ఈ దాడుల్లో బయటపడ్డాయి.

**డబుల్ సాఫ్ట్‌వేర్ స్కామ్ – ప్రభుత్వానికి ఒక లెక్క, తల్లిదండ్రులకు మరో లెక్క!**

శ్రీ చైతన్య గ్రూప్ తన అక్రమాలను కప్పిపుచ్చేందుకు ప్రత్యేకంగా రెండు రకాల సాఫ్ట్‌వేర్‌లు రూపొందించింది., తల్లిదండ్రుల కోసం ఒక లెక్క చూపే సాఫ్ట్‌వేర్ , ప్రభుత్వానికి మరో తప్పుడు లెక్క చూపే సాఫ్ట్‌వేర్. ఈ విధానం ద్వారా వేల కోట్ల రూపాయలను పన్నుల ఎగవేత ద్వారా దాచిపెట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు లక్షల రూపాయలు చెల్లించినా, ప్రభుత్వం ముందు తక్కువ ఫీజులు వసూలు చేసినట్లు చూపించి ఐటీ చెల్లింపులను తగ్గించేశారు.

**హాల్‌టికెట్ బ్లాక్‌మెయిల్ – చివరి నిమిషంలో బలవంతపు వసూళ్లు**

పరీక్షలు రాయాలంటే హాల్‌టికెట్ తప్పనిసరి. కానీ, శ్రీ చైతన్య సంస్థ హాల్‌టికెట్ అందజేయడానికి ముందు ఫీజుల మొత్తాన్ని పూర్తిగా చెల్లించాల్సిందే అని తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చింది. ఫీజు కట్టని విద్యార్థులకు హాల్‌టికెట్ అందకుండా బ్లాక్ చేసి, చివరి నిమిషంలో బలవంతపు వసూళ్లు చేసింది. విద్యార్థులను పరీక్ష రాయనీయకుండా చేయడమే కాదు, తల్లిదండ్రులను తీవ్ర ఒత్తిడికి గురి చేసింది.

**కార్పొరేట్ విద్యాసంస్థల వెనుక ఉన్న అసలైన మాస్టర్‌మైండ్స్ ఎవరు?**

ఇంత పెద్ద స్కామ్ వెనుక కేవలం ఒక్క సంస్థ మాత్రమే ఉందా? లేక విద్యా మాఫియాలో మరో హైలెవెల్ మదతుదారులు ఉన్నారా? ప్రభుత్వం ఈ అక్రమాలను ఎందుకు పట్టించుకోవడం లేదు? ఈ స్కామ్‌కు గట్టి మద్దతుదారులు ఎవరు? విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలంటే ఎవరు ముందుకు రావాలి?

### తెలుగుతో పాటు ఉర్దూ సినిమాలకి

## గద్దర్ అవార్డులు

**హైదరాబాద్, మహా:** ఈ ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేయనుండగా, గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డుల విధి విధానాలకు సంబంధించి బుధవారం ఎఫ్ డిసి ఛైర్మన్ దిల్ రాజు ప్రెస్ మీట్ నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైడి జయరాజ్, కాంతారావు పేర్లపై ప్రత్యేక అవార్డులు ఇవ్వబోతున్నట్లు దిల్ రాజు తెలిపాడు. అలాగే తెలుగుతో పాటు ఉర్దూ సినిమాలకు అవార్డులలో ప్రాధాన్యత ఉంటుందని.. 2014 నుంచి 2013 వరకు ఏడాదికో సినిమాకు గద్దర్ అవార్డు ఇస్తామని వెల్లడించాడు. ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా అవార్డుల వేడుక ఉంటుందని వెల్లడించాడు. గతంలో సింహా అవార్డులకు దరఖాస్తు చేసుకున్నవారికి వారి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని తెలిపాడు. ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యతా చిత్రం, బాలల చిత్రం, పర్యావరణం, చారిత్రక సంపద తదితర విభాగాల్లో ఎంపిక చేసిన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయనున్నారు. వీటితో పాటు తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్ , షార్ట్‌ఫిల్మ్ విభాగాల్లో కూడా అవార్డులను అందించనున్నారు.

# సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

## ఇద్దరు మహిళ జర్నలిస్టుల అరెస్ట్

**మహా:** సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వప్రసాద్ మీడియాకు వివరించారు. నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించామని విశ్వ ప్రసాద్ అన్నారు. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను నిప్పుకోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఓ వ్యక్తిని ఉద్దేశ్యపూర్వకంగా ఇంటర్వ్యూ చేస్తూ రేవంత్ రెడ్డిను అసభ్యకర వ్యాఖ్యలతో దూషించేలా చేశారని పోలీసులు గుర్తించారు. ఆ వీడియో గత నెలలో రికార్డు చేసినా అసెంబ్లీ సమావేశాలకు రెండు రోజుల ముందు టెలికాస్ట్ చేశారని విశ్వప్రసాద్ తెలిపారు. ఈ వీడియోను నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో వైరల్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇన్సెటివ్స్ తీసుకుని మరీ ట్రోల్ చేస్తున్నట్లు తెలిపారు. కైలాష్ ఫిర్యాదు ఆధారంగా సెక్షన్ 67 ఐటీ యాక్ట్, 111బిఎన్ఎస్, 61(2), 353(2),352 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**14 రోజుల రిమాండ్**

కేసు దర్యాప్తు చేసి పల్స్ టీవీ ఛానెల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశామని అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. మాదాపూర్‌లోని టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి 2 ల్యాప్ టాప్‌లు, 2 హార్డ్ డిస్క్‌లు, లోగో, రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేవతిపై గతంలో ఎల్‌బీనగర్, బంజారాహిల్స్‌లో కేసులు ఉన్నాయని వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్ గూడ జైలుకు తరలించారు.

# ఎంతకాలమీ పాతకార్డులు

## అసెంబ్లీ సెక్రటరీ పై మంత్రి పొన్నం అసహనం

**హైదరాబాద్, మహా:** జర్నలిస్టుల దగ్గర ఉన్న పాతకార్డులు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంకా ఎంతకాలం వీటిని కొనసాగిస్తారంటూ ఆగ్రహించారు. జర్నలిస్ట్ ల దగ్గర ఉన్న పాత అసెంబ్లీ పాస్ లను పొన్నం పరిశీలించారు. ఇంకా పాత కార్డు లనే కొనసాగించడం పై అసహనం వ్యక్తం చేసిన మంత్రి ఇంకెప్పుడు మారుస్తారు అంటూ సెక్రటరీ ని ప్రశ్నించారు.



# కుల గణన పేరుతో బీసీలను కాంగ్రెస్ అవమానించింది

**హైదరాబాద్, మహా:** బీసీలను కులగణన పేరుతో వంచించి.. అవమానించిందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క బీసీ సంక్షేమ సంఘం మీ లెక్కలు సరైనవని అంటుందా? ఒక్క బీసీ బిడ్డ మీ లెక్కతో ఏకీభవిస్తున్నడా? మీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలైనా ఏకీభవించే పరిస్థితి ఉందా?' అంటూ ప్రశ్నించారు. ఇవాళ కుల గణన పేరుతో బీసీలను వంచించి.. మోసం చేసి.. బీసీ సంఖ్యను తగ్గించి.. ఏదో ఉద్ధరించినట్లు సోషల్ జస్టిస్ అని గవర్నర్ నోటివెంట అబద్ధాలు చెప్పించడం సిగ్గుచేటు. కాంగ్రెస్ తల్లిని తీసుకువచ్చి సెక్రటేరియట్‌లో పెట్టి.. రాహుల్ తండ్రి సెక్రటేరియట్ ముందు పెట్టి అదేదో గొప్ప పని చేసినట్లు.. తెలంగాణకు ఏదో ఉద్ధరించినట్లు.. సిగ్గు లేకుండా మాట్లాడుతున్న ఈ ప్రభుత్వానికి మేం చెప్పేది ఒక్కటే.. కాంగ్రెస్ తల్లిని, రాహుల్ గాంధీ తండ్రి మంచిగా భద్రంగా ప్యాక్ చేసి గాంధీ భవన్‌కు మూడేళ్ల తర్వాత పంపిస్తాం. గవర్నర్ ప్రసంగం ఇవాళ పూర్తిస్థాయిలో ప్రజలను వంచించడమే కాకుండా.. మోసం చేయడమే కాకుండా.. గవర్నర్ ప్రతిష్టను సైతం తగ్గించింది' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు.

### చీఫ్ మినిస్టర్ త్వరగా కోలుకోవాలి

సీఎం త్వరగా కోలుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యల పట్ల కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్విట్టర్ లో కేటీఆర్.. ఈ పిచ్చి కుక్క మర్యాదకు ఉండే అన్ని పరిమితులను దాటి ప్రవర్తిస్తుందని అన్నారు. అలాగే ఆయనను వీలైనంత త్వరగా మానసిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని అతని కుటుంబ సభ్యులను అభ్యర్థిస్తున్నాను అంటూ.. లేకుంటే నిరుత్సాహ స్థితిలో చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్కరినీ కరుస్తాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. చీఫ్ మినిస్టర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని బీఆర్ఎస్ నేత రాసుకొచ్చారు. కాగా బుధవారం సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల అనంతరం రవీంద్ర భారతిలో జూనియర్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాకు స్ట్రెచర్ ఉందని వీర్రవీగారని, ఇకనైనా ఆ వైఖరి మార్చుకోవాలని అన్నారు.

# ఈనెల 19న రాష్ట్ర బడ్జెట్

## 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

**మహా:** ఈనెల 19న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు బీఏసీ సమావేశంలో తీర్మానం చేశారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో ప్రారంభమైన బీఏసీ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు.

**అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ :**

ఈనెల 13(రేపు) గవర్నర్ ప్రసంగంపై చర్చ
14న హోలీ సెలవు
15 గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సమాధానం
16న సెలవు, 17,18న ప్రభుత్వ బిజినెస్
19న బడ్జెట్, 20న సెలవు
21న బడ్జెట్‌పై సాధారణ చర్చ
22,24,25,26 పద్దులపై చర్చ
27 ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ

### ఫైళ్లు దగ్ధం చేయగలరేమో

# కానీ నిజాల్ని చెరపలేరు

## హోంమంత్రి వంగలపూడి అనిత

**సీఐడీ దర్యాప్తు పూర్తికాగనే చర్యలు చేపడతాం**

**మదనపల్లి ఫైళ్లదహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల హస్తం**

**సీబీఐ దర్యాప్తులో విశాఖ ఓడరేవుకు కంటైనర్ల ద్వారా డ్రగ్స్ కేసు**

**మహా :** మదనపల్లి ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల హస్తం ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సబ్ కలెక్టక్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి కీలక ఫైళ్లను దగ్ధం చేసిన కేసులో ఇప్పటికే ఆర్డీవో మురళీ,కొత్త ఆర్డీవో హరిప్రసాద్,జూనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌పై ప్రాథమిక విచారణ అనంతరం సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ నేతృత్వంలో వేగంగా దర్యాప్తు జరుగుతుందన్నారు. శాసనమండలిలో ఎంఎల్సీలు తిరుమలనాయుడు,దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి బదులిచ్చారు. ఇప్పటికే జూనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ సహా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులైన పీఏ తుకారం, మాధవ్ రెడ్డి తదితరులను ఏ1,ఏ2,ఏ3గా పేర్కొంటూ విచారణ జరుగుతుందన్నారు. పాత ఆర్డీవో మురళీ నేతృత్వంలో అసైన్డ్ ల్యాండ్ 79,107 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద 22ఏ రికార్డుల నుంచి బయటకి విడుదల చేసినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ స్థాయిలో పునర్విచారణ నేపథ్యంలో 22,523 ఎకరాల భూమి విషయంలో నిబంధనలు అతిక్రమించినట్లు తేలిందన్నారు. దీనిపై ప్రాథమిక నివేదిక వచ్చిందని అధికారిక నివేదిక కూడా రావాల్సి ఉందన్నారు. అగ్నిప్రమాదం వెనుక దాగి ఉన్న



అసలు కుట్రలను కూటమి ప్రభుత్వం బయటపెట్టడం జరిగిందన్నారు. అక్రమంగా భూమిని ఆక్రమించాలనుకుని నిబంధనలను అతిక్రమించిన పెద్దిరెడ్డి అండ్ కో కుట్ర వల్లే అగ్నిప్రమాదం జరిగిందన్నారు. మదనపల్లి ఆర్డీవో ఆఫీస్ లో ఫైళ్లను దగ్ధం చేయగలరేమోగానీ నిజాల్ని చెరపలేరని హోంమంత్రి అన్నారు. తప్పు చేసిన వారిని, అందుకు సహకరించిన వారిని వదలబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి పేర్కొన్నారు. 2024లో విశాఖపట్నం ఓడరేవుకు కంటైనర్ల ద్వారా భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు రావడంపై ఎంఎల్సీలు డాక్టర్ కుంభ రవిబాబు, వరుదు కళ్యాణి, చంద్రగిరి యేసురత్నం శాసనమండలిలో ప్రశ్నించారు. విశాఖపట్నం ఓడరేవుకు కంటైనర్ల ద్వారా భారీమొత్తంలో మాదకద్రవ్యాలు దొరికిన కేసు కూడా సీబీఐ పరిధిలో ఉందని హోంమంత్రి అనిత సమాధానమిచ్చారు.

### రాజకీయ పార్టీలకు భట్టి,జనారెడ్డి

# బహిరంగ లేఖ

## పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం

**మహా, హైదరాబాద్:** రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తామని.. ప్రతి పార్టీని ఆహ్వానిస్తామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని.. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలని భట్టి విక్రమార్క, జానారెడ్డిలు సంయుక్తంగా బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని.. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని బహిరంగ లేఖ ద్వారా వారు స్పష్టం చేశారు.

EDITORIAL సంపాదకీయం

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ జిష్ణుదేవ్ తెలంగాణ ప్రభుత్వ పథకాలు, అమలు విధానం, కార్యాచరణను అసెంబ్లీ సాక్షిగా ఆవిష్కరించారు. ఆర్థికమాంద్యం ప్రపంచ వ్యాప్తంగా కలవరపెడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ అంచనాలపై ఆసక్తి నెలకొంది. ఆర్థిక మాంద్యంతోపాటు రాష్ట్ర సొంత పన్ను రాబడులు తగ్గిపోవడం, రిజిస్ట్రేషన్లు, జీఎస్టీ రాబడుల్లో తగ్గుదల, రెవెన్యూ రాబడులకు, ఖర్చుకు మధ్య భారీ తేడా ఉండటం, ప్రతిపాదిత బడ్జెట్ అంచనాలు, సవరించిన అంచనాలకు మధ్య రూ.50 వేల కోట్ల వరకు లోటు ఉండటం వంటివి కీలకంగా మారాయి. అయితే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని వాస్తవిక బడ్జెట్‌ను తయారుచేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది రుణమాఫీకి భారీగా నిధులు కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాదిలో అనేక కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదించగా.. ఈసారి రూ.3.20 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో బడ్జెట్ పరిమాణం ఏ రకంగా ఉంటుందో చెప్పలేమని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ సైజ్ తగ్గించినా ఆశ్చర్యం లేదు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ పథకాలకు పెద్ద మొత్తంలో నిధులు అవసరముంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకుంటున్న ఫ్యూచర్ సిటీ, ఇందిరమ్మ ఇళ్లకు రూ.20 వేల కోట్లు, నీటిపారుదల రంగానికి రూ.19 వేల కోట్లు, విద్యుత్ రంగానికి సుమారు రూ.14 వేల కోట్లు, రవాణాకు రూ.5,800 కోట్లు, పెన్షన్ల పెంపు అమలుకు మరో రూ.8 వేల కోట్లు కావాలి.

యువ వికాసానికి రూ.6 వేల కోట్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు రూ.11,500 కోట్లు కేటాయింపులు చేస్తారని భావిస్తున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి, వైద్యారోగ్య రంగాలకు కూడా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆరంభించింది. తొలిరోజు అసెంబ్లీకి కేసీఆర్ హాజరయ్యారు. అయితే తర్వాత హాజరవుతారా లేదా అన్న ఆసక్తి నెలకొంది. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలంటే ఎవరి రాజకీయ వ్యూహాలు వారికి ఉంటాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలతోపాటు ఎంఐఎం, సీపీఐ సిద్ధమయ్యాయి. గత ఏడాది కాలంలో రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించడమే ప్రధాన ఉద్దేశంగా ఈసారి అధికార కాంగ్రెస్ అసెంబ్లీని వేదికగా చేసుకోగా, కేసీఆర్ హాజరు ఆసక్తిని గొలుతోంది. కులగణన, ఎస్సీల వర్గీకరణతోపాటు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు కోసం తీసుకున్న చర్యలు, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించేలా ప్రణాళికలు రచిస్తోంది. గవర్నర్ ప్రసంగంలోనూ ఈ అంశాలు ప్రస్తావించింది. మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రెడీ అయింది. ఆరు గ్యారంటీలు, కృష్ణా జలాలు, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, రాష్ట్రంలో కరువు పరిస్థితులు, తాగు, సాగునీటి కొరత, యూరియా, సాగునీటి కోసం రైతుల ఇబ్బందులు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడాలని నిర్ణయించింది. తాజా ఎమ్మెల్సీ ఫలితాలు బిజెపికి ఉత్సాహాన్ని కలిగించగా, ఇప్పటినుండి మరింత ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని నిర్ణయించాయి. తెలంగాణ ఆర్థికప్రగతి లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళాలని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారు. గురువారం నుండి సమావేశాలు ప్రజాకోణంలో జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# సామాజిక మాధ్యమాల్లో ముప్పుపై అవగాహన అవసరం

సోషల్ మీడియా దుర్వ్యసనంగా మారిన వైనమూ, దాని పర్యవసానాలూ చెదురుమదురుగా కనిపిస్తూనే ఉన్నాయి. కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చినప్పుడు కొత్త తలనొప్పులు సహజమే. ఈ నేపథ్యంలో 18 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవటానికి తల్లిదండ్రుల అనుమతి తప్పని సరి చేస్తూ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం ముసాయిదా నిబంధనలను కేంద్రం రూపొందించింది. అభ్యంతరాలు, సూచనలు వచ్చే నెల 18లోగా తెలియజేయాలని కోరింది. డేటా పరిరక్షణ కోసం, వ్యక్తిగత గోప్యత భద్రత కోసం ఒక చట్టం అవసరమన్న సంగతిని మన పాలకులు గ్రహించటంలో అలవిమాలిన జాప్యం చోటుచేసుకుంది. పౌరుల వేలిముద్రలు, బ్యాంకు ఖాతాలతో సహా సమస్త వివరాలనూ సేకరించే ఆధార్ వ్యవస్థ తీసుకొచ్చిన ఏడెనిమిదేళ్ల వరకూ ఆ డేటా పరిరక్షణకు ఎలాంటి కట్టుదిట్టాలు అవసరమన్నది ఎవరికీ తట్టలేదు. కాలం మారుతున్నకొద్దీ, సాంకేతికతలు విస్తరిస్తున్నకొద్దీ కొత్త భయాలు పుట్టుకొస్తాయి. తమ పిల్లలు సోషల్ మీడియా వ్యామోహంవల్ల చెడిపోతున్నారని కొన్నాళ్లుగా తల్లిదండ్రుల్లో బెంగ పట్టు కుంది. అక్కడ తారసపడే విశృంఖల పోకడలు, తప్పుడు భావాలు పిల్లల మెదళ్లపై దుష్ప్రభావం కలగ జేస్తున్నాయి. వారి బాల్య, కౌమార దశలను కొల్లగొడుతున్నాయి. పిల్లలకు మాదకద్రవ్యాలు అల వాటు చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కాదనలేనిది. 2017లో జస్టిస్ పుట్టస్వామి పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను తొలిసారి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. మరో ఆరేళ్ల తర్వాత 2023 ఆగస్టులో డీపీడీపీ చట్టం వచ్చింది. దాని అమలుకు సంబంధించిన నిబంధనల రూపకల్పనకు మళ్లీ ఇన్ని నెలలు పట్టింది. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్న వర్త మానంలో ఈ అంశంపై ఇప్పటికైనా ముసాయిదా నిబంధనలు రావటం హర్షించదగ్గది.



ప్రస్తుతం ఎటునుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని వాతావరణంలో ప్రపంచం మనుగడ సాగిస్తోంది. గోడలకు చెవులుంటాయన్నది పాత సామెత. స్మార్ట్ ఫోన్లకు చెవులే కాదు... కళ్లు కూడా ఉంటున్నాయి. మనం పక్కవారితో సాగించే పిచ్చాపాటీని సైతం వినే సదుపాయం ఆ ఫోన్లలో ఉంటున్నదని, మన ఇష్టాయిష్టాలు తెలుసుకోవటం, వాటి ఆధారంగా డేటా రూపొంది క్షణాల్లో ఎవరెవరికో చేరిపోవటం రివాజైందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఫోన్‌లు వినియోగించనప్పుడు సైతం వాటి కెమెరాలు కళ్లు తెరిచే సాంకేతికత ఉన్నదంటున్నారు. ఇలాంటి ఫోన్‌లు తెలిసీతెలియని వయసులో ఉన్న పిల్లలకు ఎంత చేటు తీసుకురాగలవో ఊహించటానికి కూడా భయం వేస్తుంది. అందువల్లే ఎప్పుడెప్పుడు తగిన నిబంధనలు వస్తాయా అని తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. తమ డేటా, బ్యాంకు ఖాతాల సమాచారం బయటకెలా పోతున్నదో తెలియక పెద్దలు కంగారు పడుతుంటే సామాజిక మాధ్యమాల్లో దుండగుల బారినపడి పిల్లలు తల్లడిల్లు తున్నారు. వినియోగదారుల డేటా సేకరణలో పారదర్శకతనూ, ఎందుకోసం సేకరిస్తున్నారో వెల్లడించటాన్నీ నిబంధనలు తప్పనిసరి చేస్తున్నాయి. ఒకవేళ సంస్థల అజాగ్రత్త వల్ల లేదా ఉద్దేశపూర్వక చర్యవల్ల డేటా లీకైతే ఫిర్యాదు చేయటానికి కూడా ఏర్పాట్లున్నాయి. అలాగే సంస్థల్లో డేటా సేకర ణకు అనుసరిస్తున్న విధానాలను సవాలు చేయటానికి, వివరణ కోరటానికి అవకాశం ఉంది. నిబంధనల అమలును పర్యవేక్షించటానికి ప్రభుత్వం డేటా పరిరక్షణ బోర్డు (డీపీబీ) ఏర్పాటు చేస్తుంది. ఇదిగాక ప్రతి సంస్థా తమ ఖాతాదార్ల గోప్యత దెబ్బతినకుండా చూసేందుకు, వినియోగదారుల నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు డేటా పరిరక్షణ ప్రత్యేక అధికారిని నియమించు కోవటం, నిఘా పెట్టడం తప్పనిసరవుతుంది. డేటా లీక్‌ను అరికట్టడంలో విఫలమయ్యే సంస్థకు రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో 137 దేశాలు చాన్నాళ్ల క్రితమే డేటా పరిరక్షణ చట్టాలు తెచ్చాయి. అమెరికాలో పదమూడేళ్లలోపు పిల్లలు ఆన్‌లైన్ వీక్షణపై కఠిన నిబంధనలున్నాయి. యూరప్‌లో పదహారేళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రుల అనుమతి అవసరం. ఆస్ట్రేలియా సామాజిక మాధ్యమాల్లో పదహారేళ్లలోపు పిల్లల ప్రవేశంపై ఇటీవలే పూర్తి నిషేధం విధించింది. మన దేశంలో లేదుగానీ... టిక్‌టాక్ వల్ల విదేశాల్లో ఎన్నో సమస్యలొస్తున్నాయి. టీనేజ్ పిల్లల్లో 58 శాతంమంది దాన్ని చూస్తు న్నారని ఒక సర్వే చెబుతోంది. పసిహృదయాలకు ఉండాల్సిన అమాయకత్వం మాయమై అవాంఛ నీయ పోకడలు ప్రవేశించి వారిలో విషబీజాలు నాటుతున్నాయి. తప్పుడు భావాలూ, అభిప్రా యాలూ వ్యాపిస్తున్నాయి. పిల్లల సంగతలావుంచి... పెద్దలే వాటి మాయలో పడి తప్పుడు నిర్ణ యాలు తీసుకుంటున్నారు. ఆర్థికంగా కలిగే నష్టం నేరుగా కనబడుతుంది. కానీ మానసికంగా అది కలగజేసే ప్రభావం లెక్కకు అందనిది. ఇప్పుడు ఏఐ సైతం వచ్చి ప్రమాద తీవ్రతను పెంచింది. అందువల్ల సామాజిక మాధ్య మాల్లో పొంచి వుండే ప్రమాదాలపై ముందు తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. పిల్లల సంరక్షణకు ఇది తప్పనిసరి.

# కాల్పుల విరమణకు ఉక్రెయిన్ గ్రీన్ సిగ్నల్

## బదులుగా ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సాయం



**మహా:** రష్యాతో యుద్ధంలో 30రోజుల సాధారణ కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. అందుకు బదులుగా సైనిక సాయం, నిఘా సమాచారాన్ని పంచుకోవడానికి అమెరికా అంగీకరించింది. సౌదీ అరేబియాలో ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల తర్వాత ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వీలైనంత త్వరగా ఖనిజ వనరుల ఒప్పందంపై సంతకం చేయాలని కీవ్ వాషింగ్టన్ నిర్ణయించాయి. అమెరికా ప్రతిపాదించిన 30రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించగా, చర్చల ద్వారా పొడిగించే వీలుంటుంది. కాల్పుల విరమణకు రష్యా ఆమోదం తెలిపితే ఏకకాలంలో ఒప్పందం అమలు చేయాల్సి ఉంటుందని అమెరికాఉక్రెయిన్ పేర్కొన్నాయి. శాంతిస్థాపనకు రష్యా నిర్ణయం కీలకమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కోరూబియో అన్నారు. సౌదీలో చర్చలు విజయవంతమైన నేపథ్యంలో జెలెన్‌స్కీని తిరిగి వైట్‌హౌజ్‌లోకి ఆహ్వానించేందుకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు.

### పుతిన్ కూడా అంగీకరిస్తారని ఆశిస్తున్నా- ట్రంప్

'కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. ఇప్పడు మనం రష్యా వెళ్లాలి. అధ్యక్షుడు పుతిన్ కూడా అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. వారానికి రెండు, మూడు, నాలుగువేల మంది సైనికులు చనిపోతున్నారని నివేదికలు అందుతున్నాయి. బాంబు దాడుల్లో చాలామంది ప్రజలు మరణిస్తున్నారు. మేం ఆ యుద్ధాన్ని ముగించాలని అనుకుంటున్నాం. కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది.. రష్యా కూడా అంగీకరిస్తుందని ఆశిస్తున్నాను. రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనను వారికి దృష్టికి కూడా తీసుకెళ్తాం. యుద్ధ విరమణ చాలా ముఖ్యం. రష్యాను కూడా అంగీకరిస్తే చాలా బాగుంటుంది. లేకపోతే ప్రజల మరణాలు కొనసాగుతూనే ఉంటాయి' అని ట్రంప్ అన్నారు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

## ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన గాలి ఏ ప్రాంతంలో ఉందో కనిపెట్టిన శాస్త్రవేత్తలు..

# అక్కడ కాలుష్యం జాడే కనిపించదు

గాలి కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న రోజులివి. కొన్నిచోట్ల స్వచ్ఛమైన గాలిని కాసేపు ఆక్సిజన్ సిలిండర్ల ద్వారా పీల్చుకోవాల్సిన పరిస్థితి కూడా ఉంది. అందుకే శాస్త్రవేత్తలు ఈ ప్రపంచంలో ఎక్కడ స్వచ్ఛమైన గాలి ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఆస్ట్రేలియాలోని టాస్మానియాలో కెనుక్ అనే చోట ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన గాలి ఉందని కనుగొన్నారు. ఇక్కడ గాలి చాలా స్వచ్ఛంగా ఉంటుంది. అందుకే శాస్త్రవేత్తలు తమ వాతావరణ అధ్యయనాలకు ఇదే ప్రదేశాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ప్రదేశం ప్రపంచంలోనే మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఎందుకు భిన్నంగా ఉంటుందో, అత్యంత పరిశుభ్రమైన గాలిని ఎందుకు కలిగి ఉందో తెలుసుకుందాం.

### ఆస్ట్రేలియాలో...

టాస్మానియాలోని కెనుక్ ప్రాంతంలోని గాలి పరిశుభ్రంగా ఉంటుంది. దీన్నే కేప్ గ్రిమ్ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడికి చేరే గాలులు నైరుతి దిశలో ప్రయాణిస్తూ వస్తాయి. ఈ గాలులు దక్షిణ మహాసముద్రం మీదుగా వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ఆ వైపుగా పారిశ్రామిక కార్యకలాపాలు ఏవి జరగడం లేదు కాబట్టే అటు నుంచి నేరుగా ఈ కెనుక్ ప్రాంతానికి వచ్చే గాలిలో ఎలాంటి కలుషితాలు ఉండవు. కాలుష్యాలు కనపడదు. అందుకే అక్కడ ఉన్న ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారు.

### వాయు కాలుష్య కేంద్రం

ఈ కెనుక్ ప్రాంతంలోని గాలి గురించి ముందే శాస్త్రవేత్తలకు తెలుసు. అందుకే ఇక్కడ వాయు కాలుష్య కేంద్రాన్ని 1976లోనే స్థాపించారు. ఈ స్టేషన్ ఆస్ట్రేలియన్ బ్యూరో ఆఫ్ మెటీరియాలజీ, కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్లు కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ కాలుష్య కేంద్రం ప్రధాన పని గ్రీన్ హౌస్ వాయువులు, ఏరోసోల్స్, ఇతర వ్యర్థాలతో కలిగిన వాతావరణాన్ని విశ్లేషించేందుకు ఏర్పాటు చేసింది. ఈ ప్రదేశం ప్రకృతి ప్రేమికులకు స్వర్గంలా ఉంటుంది. పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా మారింది. ఇక్కడున్న పర్యావరణ వ్యవస్థ ప్రకృతికి జీవాన్ని అందించింది. ఇది తీరప్రాంతాన్ని కలిగి ఉంటుంది. అడవి సముద్రం కలిసే దృశ్యాలు ఎంతో అందంగా ఉంటాయి. సహజ సౌందర్యానికి ఇది ఎంతో ప్రసిద్ధి చెందింది. స్వచ్ఛమైన గాలిని పీల్చాలనుకుంటే ఈ కెనుక్ ప్రాంతానికి వెళ్లి చూడండి. అయితే వాయు కాలుష్య కేంద్రంలోకి అందరికీ ప్రవేశం ఉండదు. కానీ చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రం పర్యాటకులు తిరగవచ్చు. అక్కడున్న సహజ సౌందర్యాన్ని ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఎప్పుడైనా ఆస్ట్రేలియా వెళితే కచ్చితంగా మీరు ఈ ప్రాంతాన్ని చూడాల్సిందే. ఈ కెనుక్ సమీపంలోనే టార్కిన్ అనే అడవి ఉంది. ఇది సాహస ప్రియులకు ఎంతో నచ్చుతుంది. విభిన్న జంతుజాలాలు ఇక్కడ ఉంటాయి. ఈ ప్రాంతం చాలా ఉంటుంది. అక్కడి గాలులు మనకి తాజాదనాన్ని అందిస్తాయి. ఇవి పురాతనమైన అడుగులు ఈ ప్రాంతానికి వెళితే తిరిగి రావాలనిపించదు. శరీరంలో ఒక్కసారిగా కొత్త ఉత్తేజం చేరినట్టు అనిపిస్తుంది.



# సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే



**జనగామ, మహా;** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఈ నెల 16న నిర్వహించనున్న సందర్భంగా సభ ఏర్పాట్ల పై పాలకుర్తి రోడ్ శివునిపల్లి లోని సభా స్థలాన్ని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు, డీసీపీ లతో కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సభ ఏర్పాట్ల పై అదకారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రధాన సభా వేదిక ఎక్కడ ఉండాలి, హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి, శంకుస్థాపనలకు సంబందించిన శిలాఫలకాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి, మహిళా సంఘాలకు అందించనున్న ఆర్టీసీ బస్సులు ఎక్కడ నిలపాలి, సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సీటింగ్ ఏర్పాటు ఎలా చేయాలి, వివిఐపీ, మీడియా గ్యాలరీ ఏర్పాటు, వివిఐపీ పార్కింగ్ ఎక్కడ ఉండాలి, హెలి ప్యాడ్ నుండి సీఎం కాన్వాయి ఏ రూట్ లో రావాలి అనే అంశాలపై అధికారులతో కులాంకుశంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు వచ్చేందుకు ప్రజలు చాలా ఉత్సాహంగా ఉన్నారని 50వేల పై చిలుకు ప్రజలు సభకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు వంటి వాటిని అందరికి అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనియా సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, అలాగే ఎక్కడా కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తలేత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం వరకు సభ ఏర్పాట్లు పూర్తి కావాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, వివిధ శాఖల ఎస్ఈలు, డీఈలు, జిల్లా అధికారులు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బపై కూలీలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి

**జిల్లాలో అన్నిచోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి.. కలెక్టర్ దివాకర**

**ములుగు, మహా :** వేసవిలో ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీ పనులకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులు, కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను అదేశించారు. జిల్లాలో అన్నిచోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి జిల్లా వైద్య, విద్య, వ్యవసాయ శాఖ, మండల ఎంపీడీవోల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధిక మొత్తంలో నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని పనికి ఆహార పథకం పనులకు వెళుతున్న కూలీలకు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. వారు పనిచేస్తున్న చోట్ల తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేవనే ఆరోపణ రావద్దని, అవసరమైన పక్షంలో అదనపు ఓఆర్ఎస్ ప్యాకెట్లను తెప్పించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తులకు సకాలంలో వైద్య సేవలు అందించడానికి వైద్యులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బడి పిల్లలను ఎట్టి పరిస్థితిలో బయటికి పంపవద్దని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కూలీలు వడదెబ్బకు గురైన పక్షంలో వెంటనే వారిని తరలించడానికి 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు, జిల్లా పంచాయితీ అధికారి దేవ్ రాజ్, డీఈఓ పాణిని, డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు, ఎలక్ట్రిసిటీ డీఈ నాగేశ్వర రావు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

**సమీకృత భవన నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**

ములుగులోని గట్టమ్మతల్లి ఆలయ సమీపంలో నిర్మి



స్తున్న సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నిర్మాణం జరగాలన్నారు. త్వరితగతిన కాంపౌండ్ వాల్, వెల్వేషన్, పెయింటింగ్, గ్రీనరి, భవన సుందరీకరణ పనులు పూర్తి చేయాలని, పనులు నాణ్యత కలిగి ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# ఇటుక బట్టి కార్మికుల పిల్లలకు ప్రత్యేక బోధన

**యూనిఫామ్‌తో పాటు బ్యాగు, షూ అందజేస్తాం**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**





**కరీంనగర్, మహా:** వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రత్యేక బోధన అందిస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటుక బట్టి కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాఠశాలను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ చదువుతున్న సుమారు 50 మంది కార్మికుల పిల్లలతో ఒడియా, హిందీలో భాషల్లో మాట్లాడారు. వారికి ఇస్తున్న ఆహారం, బోధన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల పిల్లల కోసం యూనిఫామ్, షూ సాక్సులు, బ్యాగు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు పలు రాష్ట్రాల్లో సంచరించే అవకాశం ఉందని, అందువల్ల వారికి ఇంగ్లీషులో బోధించాలని, సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేయించాలని, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి సరైన చికిత్స, అనుబంధ ఆహారం అందించాలని ఆదేశించారు. డెంటల్ క్యాంపు నిర్వహించి పరీక్షలు చేయించాలని తెలిపారు. పరిశుభ్రతను, నాణ్యతను గురించి వారికి అవగాహన కల్పించాలని అన్నారు.

**ఆరవ తరగతి విద్యార్థులకు బోధించిన కలెక్టర్**

గట్టుపుత్కూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఇక్కడి ఆరవ తరగతి పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. ఉన్నత రంగాల్లో రాణించేందుకు ఇంగ్లీష్ ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో నేదునూర్ గ్రామాన్ని కలపాలి

**శ్రీశైలం రహదారిపై అఖిలపక్ష నాయకుల ధర్నా**

**లేదంటే ఆమరణ దీక్షకైనా సిద్ధమే**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఫ్యూచర్ సిటీలో మా నేదునూరు గ్రామాన్ని చేర్చాలి అంటూ శ్రీశైలం జాతీయ రహదారి, నేదునూరు గేటు వద్ద ధర్నా చేపట్టిన అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు. రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలంలో నూతనంగా నిర్మించబోయే ఫోర్త్ సిటీలో మా నేదునూర్ గ్రామాన్ని కలపాలని, గ్రామస్తులు శ్రీశైలం ప్రధాన రహదారి పై ధర్నా చేపట్టారు. ఫ్యూచర్ సిటీలో నేదునూర్ గ్రామాన్ని కలపాలని అఖిల పక్షం నాయకులు నిరసన చేయడం జరిగింది. మొదట ఫోర్త్ సిటీ మ్యాప్ లో ఉన్న నేదునూర్ గ్రామం తర్వాత మాయం అయింది.... భవిష్యత్ తరాలకి అందవలసిన ఫలాలు అందాలని గ్రామస్థుల ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫ్యూచర్ సిటీలో నేదునూర్ గ్రామాన్ని కలపాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు, వంట వార్పుతో శ్రీశైలం హైవే దిగ్బంధనం చేసి రవాణా స్తంభించేలా చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అయినా ఫ్యూచర్ సిటీలో మా గ్రామాలను కలుపు కుంటామని అఖిలపక్షం నిర్ణయం తీసుకుంది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తాం అని నాయకులు తెలిపారు. తల్లి నుండి బిడ్డను వేరు చేస్తున్న ఈ విధానం సరైనది కాదని మండిపడ్డారు. మండలంలోని ఏడు గ్రామాలు, కందుకూరు మండల కేంద్రానికి కుత వేటు దూరంలో ఉన్న గ్రామాలను కందుకూరు మండలం నుంచి విడదీసి మహేశ్వరం మండలంలో కలపడం దారుణం అని నాయకులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మా బిడ్డల భవిషత్ ఆగం అవుతుందని గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కార్యక్రమంలో అల్ పార్టీ నేతలు కలసి రావడం ఉద్యమ స్ఫూర్తి కలిగిస్తుంది. తప్పక విజయం వరిస్తుంది అని నాయకులు తెలిపారు.

# జైనత్ మండలంలో ఎస్పీ పర్యటన

**సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి ఐపీఎస్**

**జైనథ్ సర్కిల్ కార్యాలయం పోలీస్ స్టేషన్**

**పిప్పర్ వాడ,పెన్ గంగా, బోరజ్ చెక్ పోస్టుల తనిఖీ**

**జైనథ్ లక్ష్మీనారాయణ ఆలయ సందర్శన**



**ఆదిలాబాద్ మహా :** జిల్లాకు నూతనంగా విచ్చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తనదైన శైలిలో జిల్లాలో ఆకస్మిక పర్యటనలు చేస్తున్నారు. బుధవారం జైనథ్ మండలంలో పర్యటించారు. పోలీస్ స్టేషన్ను, చెక్ పోస్ట్ లను తనిఖీ చేసారు. సుప్రసిద్ధ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు.స్టేషన్ లో సిబ్బంది చేస్తున్న విధులను, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో లభ్యమైన వాహనాల పై సిబ్బందిని అడిగి ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో వచ్చే గ్రామాలు, మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న పోలీస్ స్టేషన్ల వివరాలు, నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్ ఆవరణలో ఒక మొక్కనాటారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రిసెప్షన్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ రికార్డులు, స్టేషన్ రికార్డులను, లాకప్, రైటర్, సాంకేతిక నిపుణుల కార్యాలయాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో , ఆఫ్ లైన్ లో నమోదు చేస్తూ బాధితులకు సత్వర పరిష్కారాన్ని అందజేయాలని తెలిపారు. సరిహద్దు మహారాష్ట్రతో ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పూర్తిగా రూపుమాపే దిశగా నిరంతరం సక్రమంగా విధులు నిర్వహించాలని తెలియజేశారు. ఆలయ సందర్శనలో స్థల పురాణాన్ని తెలుసుకున్నారు. ఆలయంలో కలియతిరిగి దైవ దర్శనం చేసుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఆలయ అధికారులు జిల్లా ఎస్పీని సన్మానించి, స్వామివారి చిత్రపటం బహుకరించి సత్కరించారు. అనంతరం జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకొచ్చే పిప్పర్ వాడ టోల్ ప్లాజా , పెన్ గంగా సరిహద్దు, బోరజ్ చెక్ పోస్ట్ లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సీఐ సాయినాథ్, ఎస్సైలు పురుషోత్తం, మధు కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాడువాయి చార్జీలను మార్కెట్ కమిటీ చెల్లించాలి

**రాష్ట్ర కన్వీనర్ సోమీడి శ్రీనివాస్**



**వరంగల్, మహా;** రైతులు కష్టపడి పంట పండించిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్ కు తీసుకొస్తే అనేక రకాలుగా చార్జీలు వసూలు చేస్తున్నారు రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలంటే బస్తాలుతూకం వేసే దడువాయి చార్జీలను మార్కెట్ కమిటీ లు భరాయించే విధంగా ఉండాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జెడిఎం శ్రీనివాస్ ను వరంగల్ కార్యాలయంలో కలిసి మెమోరాండం అందించారు. రైతులు పండించిన పంటను మార్కెట్టుకు తీసుకొస్తే అనేక రకాలుగా రైతుల పంటలపై చార్జీలు వేయడం జరుగుతుందని ఈ తూకం ఒక రైతుకే అవసరం కాదు ఇట్టి పంటను కొనుగోలు చేసే వారికి కూడా అవసరమైన రైతునుండే ఈ చార్జీలు వసూలు చేయడం రైతులపైనే భారం పడుతుందని రైతులపై భారం తగ్గించాలంటే పంటను కొనుగోలు చేసేవారు కూడా సగభాగాన్ని మార్కెట్ అధికారులు ఇప్పించాలని లేదంటే మార్కెట్ కమిటీలే ఈ రూపాయలను దాడువాయిలకు చెల్లించాల్సిందే అని మార్కెట్కు రైతులు అమ్మిన పంట పై సంవత్సరానికి ఆదాయం కోట్ల రూపాయలలో వస్తుందని ఇంత పెద్ద మొత్తంలో మార్కెట్లకు ఆదాయం రైతుల అమ్మిన పంటపై వచ్చినప్పుడు దాడువాయులకు రైతుల వద్ద నుండి మినహాయించి మార్కెట్ కమిటీ నుంచే వీరికి ఈ రూపాయలను ఇప్పించి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ కోరడం జరిగింది. దాదాపు రైతులకు ఖర్చులు తగ్గితే భారం తగ్గుతుంది మార్కెట్ ద్వారానే రైతులు పంటను అమ్ముకునే విధంగా చూడాలని శ్రీనివాస్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరిగింది.

# ఓఆర్ఆర్ సిబ్బందిపై దాడికి యత్నించిన ట్యాంకర్ డ్రైవర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బొంగులూరు ఓఆర్ఆర్ వద్ద ట్యాంకర్తో డ్రైనేజీ వ్యర్థ మరుగు నీటిని బహిరంగంగా వదిలి వెళ్తున్న ముఠాను ఓఆర్ఆర్ సిబ్బంది అడ్డుకున్నారు. శ్రీఆంజనేయ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ అండ్ సర్వీస్ కు చెందిన ట్యాంకరు, వివిధ కంపెనీలు, ప్రైవేట్ హాస్టల్ల నుంచి తెస్తున్న వ్యర్థ మరుగును, గత కొన్ని నెలలుగా సర్వీస్ రోడ్డులో పారబోస్తున్నారని, దీనివల్ల ప్రాంతం అంతా దుర్వాసన రావడం జరుగుతుందని, ఈ దుర్వాసనతో సర్వీస్ రోడ్డులో వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా ఏర్పడిందని ఓఆర్ఆర్ సిబ్బంది తెలిపారు. అడ్డుకుంటున్న సిబ్బందిపై ట్యాంకర్ డ్రైవర్ దుర్భాషలాడుతూ, దాడి చేయడానికి తెగబడ్డాడు. దీంతో సిబ్బంది టాంకర్ డ్రైవర్ పై ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ట్యాంకర్ డ్రైవర్ పై యజమానిపై తగు చర్యలు తీసుకోవాలని సిబ్బంది పోలీసులను కోరినట్లు తెలిపారు.

# డివిజన్ సమస్యల పై వినతి పత్రం

**కమిషనర్‌కు అందజేసిన కార్పొరేటర్**



**వరంగల్, మహా :** వరంగల్ నగరంలోని 40 డివిజన్ లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ను స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి బల్దియా ప్రధాన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ లో కొత్తగా వెలుస్తున్న కాలనీ ల లో కరెంటు స్తంభాలు లేక కొన్ని కరెంటు స్తంభాలకు లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాగే డివిజన్ లో నూతనంగా 25 కరెంటు స్తంభాలు 40 విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని డివిజన్ లో ఉన్న ముకుంద లేఅవుట్ పార్కు లో ప్రజలు నడవడానికి వాకింగ్ ట్రాక్ లేదని ఓపెన్ జిమ్ చిన్నపిల్లలు ఆడుకోవడానికి క్రీడా పరికరాల ఏర్పాటు మంకీ ఫుడ్ కోర్టు లో వాకింగ్ ట్రాక్ వాల్స్ దెబ్బతిన్నాయని దానివలన నీరు వృధా అవుతుందని గేటు ఎత్తు పెంచాలని ఈ వేసవి కాలంలో ఎండలు విపరీతంగా ఉన్నాయని బాటసారుల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని నీరు రాని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని పంపిణీ చేయాలని కార్పొరేటర్ కమిషనర్ ను కోరగా అందుకు ఆమె స్పందించి డివిజన్ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియపరచి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.

# అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం

**బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**



**వరంగల్, మహా;** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం 35వ డివిజన్ ఏసీ రెడ్డి నగర్ పరిధిలో విగ్రహ కమిటీ అధ్యక్షులు రేణుకుంట్ల శివ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం సమక్షంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయమని అన్నారు తెలిపారు.. ప్రపంచంలోనే భారత రాజ్యాంగానికి ప్రత్యేక స్థానముందన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానాలే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల అభ్యున్నతికి బంగారు బాటలని తెలిపారు. దేశాభివృద్ధిలో అంబేద్కర్ కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ పాల్గొన్నారు.



# విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

**సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న**

**ములుగు, మహా :** జిల్లాలోని విశ్వ బ్రాహ్మణులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ములుగులో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 25ఏళ్లుగా విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని విన్నపాలు చేసినా పట్టించు కోలేదన్నారు. తెలంగాణ కోసం ఉద్యమాలు చేసిన తమకు స్వరాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం మొండిచేయి చూపించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా స్పందించి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపతికన బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కడివెండి వీరాచారి, ఎల్కతుర్తి శ్రీహరి, మహేష్, శీలమంతుల నరసింహాచారి, ఎర్రోజు రవీంద్రాచారి, కందోజు భవన్ నారాయణ, రేసోజు శ్రీధర్, జ్ఞానేష్, గణేష్, విజ్ఞేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

# డీఆర్సీసీ కేంద్రం సామర్థ్యాన్ని పెంచండి



**బల్దియా కమిషనర్**

**డా. అశ్విని తానాజీ వాకడే**

**హనుమకొండ మహా :** డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డి ఆర్ సి సి)యందు పొడి చెత్త సామర్థ్యాన్ని పెంచాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. హనుమకొండ లోని బాల సముద్రం లో గల కాంపోస్ట్ యార్డు లో బుధవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి డి ఆర్ సి సి కేంద్రం తో పాటు కంపోస్టు యూనిట్, వర్మి కంపోస్టు తయారీ ప్రాంతం కోకా పిట్ యూనిట్ ను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డి ఆర్ సి సి కేంద్రానికి ప్రతిరోజు ఒక టన్ను పొడి చెత్త చేరేలా చర్యలు తీసుకోవాలని స్వచ్ఛ ఆటో దారులు పొడి చెత్తను తప్పనిసరిగా అందజేయాలని నిర్వహిస్తున్న రిజిస్టర్ ను కమిషనర్ పరిశీలించారు. తడి చెత్త ను కంపోస్టు ఎరువుగా మార్చాలని అనంతరం వర్మి కంపోస్టు ఎరువు తయారు చేసే ప్రాంతం లో పర్యటించి ఎరువు తయారి విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కోకా పిట్ యూనిట్ ను పరిశీలించి ప్రతి రోజూ ఉత్పత్తి అయ్యే కొబ్బరి ఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ లు అనిల్, సంపత్ రెడ్డి, వావ్ ప్రతినిధి పవన్, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా భరోస: ఇన్చార్జి ఎస్సై స్రవంతి



**ములుగు, మహా :** మహిళలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా సెంటర్లను ఏర్పాటు చేసిందని కోఆర్డినేటర్, ఇన్చార్జి ఎస్సై ఎం.స్రవంతి అన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఎదుర్కొంటున్న లైంగిక, అత్యాచారహింసల వంటి వేధింపులకు సహాయాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకొని భాదితులకు వన్స్టాప్ సొల్యూషన్ గా పనిచేస్తున్నామన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్, మంగపేట, వాజేడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన సంఘటనలతో బాధితులకు భరోసా కేంద్రం ఫండింగ్ ద్వారా బుధవారం ములుగులోని కేంద్రం ద్వారా ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొదిస్తున్నామన్నారు. భరోసా సెంటర్ కు వచ్చే కేసులను సమర్థవంతంగా నిర్వహించేలా మానసిక చికిత్స, కౌన్సిలింగ్, మెడికల్, లీగర్, ప్రాసిక్యూషన్ సేవలను అందిస్తున్నామన్నారు.



## గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు

**హార్వెస్ట్ మినిస్ట్రీస్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ లక్ష్యం**

**ఆదిలాబాద్ మహా :** మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడమే లక్ష్యంగా హార్వెస్ట్ మినిస్ట్రీస్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ స్వచ్ఛంద సంస్థలు ధన్నూర్ (బి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత మెడికల్ అండ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు.ఈసందర్భంగా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జయరాజు మాట్లాడుతూ ఆసుపత్రులకు దూరంగా ఉన్న ప్రాంతాలలో, ఆధునిక వైద్యం, కంటి, దంత, కిడ్నీ, ఎముకలు, గుండె, ఎక్స్ రే ,ఈసీజీ,వివిధ రక్త పరీక్షలు, నిర్వహించి వాటికి సరిపడా మందులు సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని, రానున్న కాలంలో ఈ సేవలను మరింత విస్తరించి ప్రతి గ్రామానికి విస్తరించే విధంగా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. ధన్నూర్ బి గ్రామంలో 520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, దాదాపు రెండు లక్షల రూపాయల విలువైన మందులను ఉచితంగా అందించారు. క్యాంపులో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ తన సహకారం అందించారు .ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు గొర్ల సురేందర్, రమణ గౌడ్ క్యాంపు నిర్వాహకులు పాస్టర్ పిడుగు సునీల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి,హార్వెస్ట్ మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ శ్రీధర్, హ్యాండ్ ఆఫ్ హోప్ ఇన్చార్జి జంగా జయరాజు, డాక్టర్లు: దేవ సహాయం, భార్గవి, స్వాతి, భక్తసింగ్, మనోజ్ఞ, శ్రీధర్, పారామెడికల్ స్టాఫ్, టెక్నిషియన్స్ ,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలలో సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేయాలి





## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలి

**మండల స్థాయి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, మహా :** మండల కేంద్రంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని, గ్రామాలలో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. బుధవారం వాజేడు మండల కేంద్రంలో ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను నిజమైన అర్హులను గుర్తించి అందజేయడానికి చొరవ చూపాలని, మండల కేంద్రాలలోని ఎంపీడీవో, ఎంపీవో కీలక పాత్ర పోషించాలని అన్నారు. వేసవికాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని, అవసరమైన పక్షంలో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను ఇప్పటికే సేకరించడం జరిగిందని, నష్టపోయిన రైతులకు ఆయా విత్తన కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. నష్టపోయిన రైతుల వివరాలను మండల వ్యవసాయ కార్యాలయంలో రెవెన్యూ కార్యాలయంలో సూచిక బోర్లపై పేర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, నష్టపోయిన రైతు పేరు లేని పక్షంలో గురువారం లోగా పేరు నమోదు చేయించుకోవాలని అన్నారు. మండలంలో అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆయా పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

**నిర్మల్ మహా :** ప్రభుత్వం నూతన పథకాలను ప్రవేశపెట్టి దివ్యాంగుల జీవితాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ ద్వారా వారికీ స్వయం సమృద్ధి కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వీటి ద్వారా దివ్యాంగులు తమ దైనందిన జీవితాన్ని సులభతరం చేసుకోవచ్చునన్నారు. భవిత సెంటర్ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగులు నిత్యజీవితంలో అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆలింకో సంస్థ సహకారంతో జిల్లాలో అర్హులుగా గుర్తించిన 91 మంది దివ్యాంగులకు సుమారు 7 లక్షల 70 వేల రూపాయల విలువగల



133 ఉపకరణాలు వీల్ చైర్లు, శ్రవణ, దృశ్య, తదితర పరికరాలను కలెక్టర్ అందించారు. ఈ ఉపకరణాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, దివ్యాంగులు నిత్యజీవితంలో అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులతో మాట్లాడుతూ వారి బాగోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వారికి అందజేసిన పరికరాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి. రామారావు, ఎంఈఓ నాగేశ్వర్ రావు, విద్యాశాఖ అధికారులు లింబాద్రి, ప్రవీణ్, దివ్యాంగులు, పోషకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం పార్టీ నాయకుల న్యాయపోరాటం

**మేళ్లచెరువు, మహా:** మేళ్లచెరువు మండల కేంద్రంలో సిపిఎం పార్టీ నాయకులు ప్రజా సమస్యలపై గల మెత్తారు ఇందిరమ్మ కాలనీ ఇళ్ల స్థలాలు ఇచ్చి చాలా సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడం సిపిఎం పార్టీ మండల నాయకులు వట్టేపు సైదులు తప్పు పట్టారు. అర్హులకు పట్టా పుస్తకాలు ఇవ్వకపోవడంతో బాధ్యులు న్యాయ పోరాటానికి దిగారు. అందుకుగాను న్యాయం జరిగే వరకు ఈ పోరుబాట కొనసాగిస్తామని తెలియజేశారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ కాలనీ బాధ్యులు సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు ఇట్టి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## కాంగ్రెస్ రంగు పులుముకున్న హిందూ దేవాలయాలు





**చింతలపాలెం, మహా:** చింతలపాలెం మండలం రేభల్లె గ్రామంలో ఈ మధ్యకాలంలో హిందూ దేవాలయాలకు గతంలో వేసిన కలర్లు పోవడంతో ఆ గ్రామంలో కొంతమంది నాయకులు,భక్తులు రంగులు వేయించేందుకు ముందుకు వచ్చారు. అందుకుగాను అయ్యప్ప స్వామి, వెంకటేశ్వర స్వామి దేవాలయాలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్యుత్సాహం చూపించి కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల కలర్లు హిందూ దేవాలయాలకు రంగులు వేయించడం గ్రామ ప్రజల్లో నిరుత్సాహం ఎదురైంది గతంలో ఎప్పుడు ఏ పార్టీ అధికారంలో ఉన్న ఇలా జరగలేదు అని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని కొంతమంది నాయకులు మూడు రంగుల పార్టీ చిహ్నానికి గుర్తుగా గుడులకు వేశారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు.దేవాలయాల మీద రాజకీయాలు చేయొద్దని మరికొందరు తప్పుపట్టారు ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు చెప్పుకొస్తున్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ రంగులు మార్చకుంటే గ్రామంలో పెద్ద ఎత్తున హిందూ సంఘాల తోటి బయటికి వెలతమని మోర్తాల నాగిరెడ్డి జాతీయ కబడ్డీ క్రీడాకారుడు తెలియజేశారు.

## ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల ఉత్సాహం

**25 శాతం రిబేటు సదుపాయాన్ని వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**

**సూర్యాపేట,మహా:** ఎల్ ఆర్ ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్.ఆర్. ఎస్ ద్వారా ప్రజలకు వెసులుబాటు కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోని తమ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని కలెక్టర్ తేజస్ అన్నారు బుధవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎల్లారీస్ అవగాహన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ వెంటనే ల్యాండ్ రెగ్యులైజేషన్ కు సంబంధించిన ప్రొసీడింగ్ లు జారీ చేయడం జరుగుతుందని సూర్యాపేట మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 961 మంది ఫీజు చెల్లింపులు పూర్తి చేశారని ఎల్లారీస్ క్రింద 4 కోట్ల 88 లక్షల రూపాయలు రుసుము వసూలు అయిందని బుధవారం 36 మంది ఫీజు చెల్లింపు చేశారని ఎల్ఆర్ఎస్ క్రింద 19,66,000 రుసుము వసూలు అయిందని కలెక్టర్ వివరించారు. మిగతా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువులోపు ఎల్ అర్ ఎస్ చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, రిబేటు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం అన్ని మున్సిపాలిటీలలో హెల్ప్ డస్కు ఏర్పాటు చేయడం జరిగిందని, దరఖాస్తుదారులు తమ సందేహాలను హెల్ప్ డస్కులలో సంప్రదించవచ్చు అని తెలిపారు. బఫర్, ఎఫ్ టి ఎల్, చెరువులు, కుంటలు వంటి నిషేధిత జాబితాలో ప్రాంతాలను మినహాయిస్తే, ఇతర ప్రాంతాలలోని ప్లాట్లకు ఆన్లైన్ లో సులభంగా




అనుమతి లభిస్తుందని అన్నారు. చెరువులు నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ వెల్లడించారు. ఎల్ ఆర్ ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90 శాతం రిఫండ్ అవుతుందని 10% ప్రాసెసింగ్ చార్జెస్ కింద తీసుకుంటారని అన్నారు. స్థలాల క్రమబద్ధీకరణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ,అర్హత ఉన్న ప్రతి ఒక్కరు తమ స్థలాలను ఎల్. ఆర్.యస్ ఫీజులు చెల్లించినట్లయితే వెంటనే ప్రొసీడింగ్ జారీ చేస్తామని తెలిపారు. ది 26 8 2020 నాటి వరకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ కలిగి గతంలో ఎల్ అర్ ఎస్ కొరకు ఒక వెయ్యి రూపాయలు చెల్లించిన వారు వెంటనే ఎల్ఆర్ఎస్ లాగిన్ ద్వారా ఫీజు చెల్లించి ఫీజులు 25% పొందాలని అన్నారు. అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే రానున్న కాలంలో ప్రజలు ఇబ్బందులకు గురి అయ్యే ఆస్కారం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## సంతోషకర వాతావరణంలో హోళి పండగ జరుపుకోవాలి

**సంప్రదాయ రంగులు ఉపయోగం ఆరోగ్యకరం**

**మహిళల పట్ల మర్యాదగా ఉండాలి...కె.నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట**

**సూర్యాపేట,మహా:** హోళీ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పి కె. నరసింహ ఐపిఎస్ ప్రజలందరికీ ముందుగా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .పండుగ ఉత్సవం జరుపుకునేవారు జాగ్రత్తలు పాటించాలని యువత ఆదర్శంగా ఉండాలి, ప్రమాదాలకు దూరంగా ఉండాలి, ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్ళవద్దు, సంప్రదాయ రంగులు ఉపయోగించడం ఆరోగ్యకరం అని ఎస్పి తెలిపారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవం జరుపుకోవాలని సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలి అన్నారు. యువత వాహనాలను విచ్చలవిడిగా వేగంగా నడపవద్దు అని కోరినారు. నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు. ప్రార్థనా మందిరాల వద్ద రంగులు చల్లవద్దు అన్నారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా



ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పి విజ్ఞప్తి చేసినారు. సీసీ కెమెరాల నిఘా ఉన్నది, వాహనాలతనిఖీలు నిర్వహిస్తాం, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు అని ఎస్పి తెలిపినారు.

## మంత్రి ఉత్తమ్ సహకారంతో గ్రామాలకు మహర్దశ



**ఆదూరి కిషోర్ రెడ్డి**


**హుజూర్ నగర్,మహా:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామాల రోడ్లకు మహర్దశ సంతరించుకుందని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆదూరి కిషోర్ రెడ్డి అన్నారు మఠంపల్లి మండల కేంద్రంలో వివిధ వార్డులలో ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులు (25 లక్షలు)తో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం ప్రారంభించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఉత్తమ్ అని గ్రామంలో మునుపెన్నడూ జరగని అభివృద్ధి ఇప్పుడు మంత్రి హయంలో జరుగుతుందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో గాదె లుర్దు మర్రెడ్డి కొత్తపల్లి కృపానందాం, వల్లపు దాస్ మహేష్ గౌడ్,హనుమంత్ గౌడ్ , కర్న్ వెంకటేశ్వర్లు,కొత్తపల్లి శౌరి,కటికల నర్సయ్య, దైద రాయులు,గోపు ఆనంద్ రెడ్డి,తిరుమల రెడ్డి బాలారెడ్డి,మల్లె బోయిన గోపయ్య , కంటు లక్ష్మయ్య భాషం వీరబాబు, యర్ర మల్ల హుస్సేన్,తవిడ బోయిన కృష్ణ,బొమ్మకంటి నాగేశ్వర్ రావు, సత్యనారాయణ,సుబ్బారావు, పుల్లయ్య శాస్త్రి,నందిపాటి రవి,మంగళ పల్లి జొజి, కంటూ కోటయ్య,చింతల గురవయ్య, చింతల వీరబాబు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డీపీఓను సన్మానించిన గిరిజన నాయకులు

**హుజూర్ నగర్,మహా:** సూర్యాపేట జిల్లా నూతన డిపిఓగా భాద్యతలు స్వికరించిన యాదగిరిని కార్యాలయంలో సూర్యాపేట జిల్లా గిరిజన నాయకులు జిల్లా ఎస్టీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ నవీన్ నాయక్ బానోతు తులసి రామ్ నాయక్ సిరి హాస్పిటల్ మేనేజ్మెంట్ భానుతునాగునాయక్ బిల్య నాయక్ తండగ్రామ శాఖ అధ్యక్షులు బానోతు మోతిలాల్ నాయక్ ఉప సర్పంచ్ బాలు నాయక్ దాదు రవి మొదలగు వారు సన్మానించడం జరిగింది.

## సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొప్పుల వేణారెడ్డి



**సూర్యాపేట,మహా:** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొప్పుల వేనారెడ్డి, వైస్ చైర్మన్ గా గట్టు శ్రీనివాస్ గుప్తా, పాలకవర్గం సభ్యులు ఘనంగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, రైతులందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. త్వరలో ప్రభుత్వ సహకారంతో సూర్యాపేట మార్కెట్లో అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామని, అలాగే మార్కెట్లో పెద్ద ఎత్తున అభినందన సభ కూడా నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్ నాయకులు అనుభవం కలిగిన వారితోనే మార్కెట్ పాలకవర్గం ఏర్పడిందని అన్నారు. మార్కెట్ పాలకవర్గం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి నియోజకవర్గ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ రఘువీర్ రెడ్డిలతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి, కుందూరు జానారెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ తాను పదవిని ఆశించని తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమించిన మాజీ మంత్రి దామన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

## డివిజన్ సమస్యలపై వినతి పత్రం

**కమిషనర్ కు అందజేసిన కార్పొరేటర్**

**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని 40వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ను స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి బల్దియా ప్రధాన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ లో కొత్తగా వెలుస్తున్న కాలనీ ల లో కరెంటు స్తంభాలు లేక కొన్ని కరెంటు స్తంభాలకు లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాగే డివిజన్ లో నూతనంగా 25 కరెంటు స్తంభాలు 40 విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని డివిజన్ లో ఉన్న ముకుంద లేఅవుట్ పార్కు లో ప్రజలు నడవడానికి వాకింగ్ ట్రాక్ లేదని ఓపెన్ జిమ్ చిన్నపిల్లలు ఆడుకోవడానికి క్రీడా పరికరాల ఏర్పాటు మంకీ ఫుడ్ కోర్టు లో వాకింగ్ ట్రాక్ వాల్స్ దెబ్బతిన్నాయని దానివలన నీరు వృధా అవుతుందని గేటు ఎత్తు పెంచాలని ఈ వేసవి కాలంలో ఎండలు విపరీతంగా ఉన్నాయని బాటసారుల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా గట్టు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం



**సూర్యాపేట,మహా:** సూర్యాపేట రూరల్ టేకుమట్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ జిల్లా నాయకులు తెలంగాణ రాష్ట్ర పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్య అనుచరుడు గట్టు శ్రీనివాసు బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కి, మాజీ మంత్రి జానారెడ్డికి, నల్గొండ పార్లమెంటు సభ్యులు రఘువీర్ రెడ్డికి, టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి కి, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ ను మార్కెట్ కార్యదర్శి సంతోష్ కుమార్ శాలువాతో సన్మానించి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహీంద్రా ఇండియన్ టేబుల్ గ్రేప్స్ ఎగుమతులకు 20 ఏళ్లు

మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్‌లో భాగమైన మహీంద్రా అగ్రి సొల్యూషన్స్ లిమిటెడ్ (MASL) భారత్ నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు టేబుల్ గ్రేప్స్ ఎగుమతులు ప్రారంభించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు వెల్లడించింది. 2005లో మహీంద్రా తొలిసారి ద్రాక్ష పండ్ల షిప్‌మెంట్‌ను యూరప్‌కి ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఉత్తర అమెరికా, యూరప్, చైనా, ఆగ్నేయాసియా, ఇతర మార్కెట్లలోని కస్టమర్లకు అత్యంత నాణ్యమైన ద్రాక్షలను అత్యుత్తమ భద్రతా ప్రమాణాలతో ఎగుమతి చేస్తోంది. సబోరో, ఫ్రూకింజ్ బ్రాండ్ల కింద థామ్సన్, సొనాకా పేరిట వైట్ సీడ్‌లెస్ ద్రాక్షలు, ఫ్లేమ్, క్రిమ్సన్ పేరిట రెడ్ సీడ్‌లెస్ ద్రాక్షలు, జంబో, శరద్ పేరిట బ్లాక్ సీడ్‌లెస్ ద్రాక్షలను ఎంఏఎస్ఎల్ సంస్థ ఎగుమతి చేస్తోంది. దాంతో ఉద్యోగాల కల్పన, సామాజిక సంక్షేమ కార్యక్రమాల ద్వారా స్థానిక కమ్యూనిటీలకు తోడ్పాటు అందిస్తోంది. ఎగుమతి చేయగలిగే విధంగా దిగుబడులను మూడు రెట్లు మెరుగుపర్చుకోవడంలో (ఎకరానికి 2.5 ఎంటీ నుంచి ఎకరానికి 7.5 ఎంటీ వరకు) రైతాంగానికి తోడ్పాటు అందిస్తోంది. సంస్థకు నాసిక్‌లో అధునాతన గ్రేప్ ప్యాక్ హౌస్ ఉండగా నాసిక్, బారామతి, సాంగ్లిలో 500 మంది పైచిలుకు రైతులతో కలిసి పని చేస్తోంది. 'గత 20 ఏళ్లలో ద్రాక్ష వ్యాపారంలో సాధించిన వృద్ధి ఎంఏఎస్ఎల్‌కు గర్వకారణం. వ్యవసాయ వేల్యూ చెయిన్‌లో భాగంగా ద్రాక్ష సాగులో పరివర్తన తేవడంపై నిబద్ధతతో పని చేస్తున్నాం. మా కృషి ఫలితంగా ఇతర దేశాలకు భారతీయ టేబుల్ గ్రేప్స్ ఎగుమతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. అలాగే ప్రాంతీయంగా వందల కొద్దీ రైతుల జీవితాలపై సానుకూలంగా ప్రభావం చూపగలిగాం' అని ఎంఏఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈవో రమేష్ రామచంద్రన్ తెలిపారు. 6.5 ఎకరాల్లో, 75,000 చ.అ. విస్తీర్ణంలో విస్తరించిన మహీంద్రా గ్రేప్ ప్యాక్ హౌస్‌లో నిత్యం 80 మెట్రిక్ టన్నుల ద్రాక్షలు ప్యాక్ చేస్తారు. ఇందులో 12 ప్రీకూలింగ్ చాంబర్లు, 170 ఎంటీ సామర్థ్యంతో రెండు కోల్డ్ స్టోరేజీ ఫెసిలిటీలు ఉన్నాయి. ఒక్కో షిఫ్టులో 500 మంది పైచిలుకు ఉద్యోగులు ఉంటారు. సుస్థిర సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు నాసిక్‌లో ఎంఏఎస్ఎల్‌కు 15 ఎకరాల్లో డెమో ఫార్మ్ ఉంది.

## ఒకే కుటుంబానికి రెండు రోజుల్లో
# రూ.6,875 కోట్ల నష్టం

ఇన్ఫోసిస్ లిమిటెడ్ షేర్ ధర వరుసగా రెండు రోజుల నుంచి భారీగా పతనమవుతోంది. దాంతో కంపెనీ షేర్ హోల్డర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అందులో మేజర్ వాటాదారులుగా ఉన్న కంపెనీ ప్రమోటర్ నారాయణమూర్తి, ఆయన కుటుంబ సభ్యులకు గణనీయంగా నష్టాలు నమోదయ్యాయి. బుధవారం ఇన్ఫోసిస్ 5.49 శాతం క్షీణించి 1,569.35 వద్ద కనిష్టాన్ని తాకింది. 2024 డిసెంబర్‌లో 52 వారాల గరిష్ట స్థాయి రూ.2,006.80తో పోలిస్తే ఈ షేరు దాదాపు 22 శాతం క్షీణించింది. దాంతో మూర్తి కుబుంబానికి ఏకంగా రెండు రోజుల్లో రూ.6,875 కోట్లు నష్టం వాటిల్లింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా టారిఫ్ వార్ కారణంగా ఐటీ కంపెనీల క్లయింట్లు పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేందుకు ఆలోచిస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. దాంతో కొన్ని బ్రోకరేజీ సంస్థలు ఇన్ఫోసిస్ స్టాక్‌ను డౌన్‌గ్రేడ్ చేయడంతో తాజా పతనం సంభవించిందని చెబుతున్నారు. కేవలం ఐటీ స్టాక్‌లే కాకుండా దాదాపు చాలా స్టాక్‌లు నష్టాల్లోనే ట్రేడవుతున్నాయి.

### ఎవరి వాటా ఎంత..

కార్పొరేట్ డేటాబేస్ ఏసీఈక్విటీతో సేకరించిన డేటా ప్రకారం ఎన్ఆర్ నారాయణమూర్తి కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు ఇన్ఫోసిస్‌లో రూ.26,287.19 కోట్ల విలువైన 4.02 శాతం వాటాను కలిగి ఉన్నారు. 2024 డిసెంబర్ 13న రూ.33,162.89 కోట్లతో పోలిస్తే ఇది ఇటీవల రూ.6,875.70 కోట్లు తగ్గింది. కంపెనీ సహ వ్యవస్థాపకుడు, ప్రమోటర్ మూర్తి ఇన్ఫోసిస్‌లో 0.40 శాతం వాటాను కలిగి ఉండగా, ఆయన భార్య సుధా మూర్తి డిసెంబర్ త్రైమాసికం చివరి నాటికి 0.92 శాతం వాటాను కలిగి ఉన్నారు. దేశంలోని రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్‌గా పేరున్న ఇన్ఫోసిస్‌లో వారి కుమారుడు రోహన్ మూర్తి, బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్ భార్య, నారాయణమూర్తి కూతురు అక్షతా మూర్తికి వరుసగా 1.62 శాతం, 1.04 శాతం వాటాలు ఉన్నాయి. మూర్తి మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తికి ఇన్ఫోసిస్‌లో స్వల్పంగా 0.04 శాతం వాటా ఉంది.



## భయపడుతున్న రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత.. ఎందుకంటే..




ప్రముఖ ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్, ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ టి కియోసాకి ప్రస్తుత మార్కెట్ అనిశ్చితులకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 18 నుంచి వరుసగా పతనమవుతున్న అమెరికా మార్కెట్లను ఉద్దేశించి 'చరిత్రలోనే భారీ పతనం రాబోతోందని భయంగా ఉంది. ఇది 1929 స్టాక్ మార్కెట్ పతనాన్ని కూడా అధిగమించగలదు' అని తెలిపారు. ఈమేరకు తన ఎక్స్ ఖాతాలో కీలక వివరాలు పోస్ట్ చేశారు. 'మార్కెట్ బుడగలా ఎగిసిపడుతోంది. రాబోయే మార్కెట్ క్రాష్ చరిత్రలోనే అతిపెద్దది కావచ్చని భయమేస్తుంది. జర్మనీ, జపాన్, అమెరికా మార్కెట్లు ఇప్పటివరకు కీలకంగా వ్యవహరించాయి. దురదృష్టవశాత్తు అసమర్థ నాయకులు పెట్టుబడిదారులను ఉచ్చులోకి నెట్టారు. ఈ క్రాష్ గురించి నేను నా పుస్తకం 'రిచ్‌డాడ్స్ ప్రొఫెసీ'లో రాశాను. ఇది 1929 గ్రేట్ డిప్రెషన్‌కు దారితీసిన పతనం కంటే పెద్దదిగా ఉండబోతుంది. ఈ సందర్భంలో కలవరపడటం, భయపడటం సాధారణం. కానీ అలా చేయకండి. మనసు ప్రశాంతంగా ఉంచుకోండి. 2008 మార్కెట్ పతనం సమయంలో భయాందోళనకు గురికాకుండా అమ్మకానికి ఉన్న ఆస్తుల వివరాలు సేకరించి అందులో పెట్టుబడి పెట్టాను. డీప్ డిస్కౌంట్‌ల్లో వాటిని పొందాను. ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ మార్కెట్ భయాలు మీ జీవితకాలంలో అవకాశంగా మారొచ్చు. మార్కెట్ అంశాలు ఎంత తీవ్ర రూపం దాల్చినా మనసు ప్రశాంతంగా ఉంచుకోండి. అందుకు అనుగుణంగా మెరుగైన అవకాశాలు ఎంచుకొని పెట్టుబడి పెట్టండి. నేను రియల్ ఎస్టేట్, బంగారం, వెండి, బిట్‌కాయిన్‌లను కొనేందుకు ఆసక్తి చూపిస్తాను' అన్నారు. నాస్‌డాక్ కాంపోజిట్ ఇటీవల 4 శాతానికి పైగా పడిపోగా, ఎస్ అండ్ పీ 500 దాదాపు 2.7 శాతం దిగజారింది. ఇది ఫిబ్రవరిలో దాని ఆల్ టైమ్ హై నుంచి 8.5 శాతం తగ్గింది. అమెరికా వాణిజ్య విధానాలతో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. సుంకాల ప్రభావంపై అమెరికా, కెనడా, మెక్సికోలోని ఆర్థికవేత్తల్లో ఆందోళన పెరుగుతోందని రాయిటర్స్ నివేదికలు చెబుతున్నాయి. కెనడా, అమెరికా, మెక్సికో దేశాల్లో నిర్వహించిన సర్వేలో భాగంగా 74 మంది ఆర్థికవేత్తల్లో 70 మంది ఆర్థిక మాంద్యం ముప్పు పెరిగిందని, ముఖ్యంగా అమెరికాలో ద్రవ్యోల్బణానికి అవకాశం ఉందని చెబుతున్నారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# రన్యారావును నిద్రపోనివ్వడం లేదు!

**బెంగళూరు:** అక్రమ బంగారం రవాణా కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావు.. బెయిల్ కోసం ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. అయితే విచారణ పేరుతో అధికారులు ఆమెను నిద్రపోవడం లేదని ఆమె తరఫు న్యాయవాది బుధవారం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ పేరుతో నా క్లయింట్ రన్యారావును డీఆర్ఐ అధికారులు నిద్రపోనివ్వడం లేదు. అరెస్టైన సమయంలో తనకున్న హక్కుల గురించి ఆమెకు పూర్తిగా తెలియదని. హత్యా అభియోగాలు దాఖలైన కేసుల్లోనూ నిందితులు మహిళలైతే బెయిల్ లభించిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. అలాంటప్పుడు నా క్లయింట్ కూడా బెయిల్ పొందడానికి అర్హురాలే. కాబట్టి ఆమెకు ఊరట ఇవ్వాలని వాదనలు వినిపించారాయన. మార్చి 3వ తేదీన.. దుబాయ్ నుంచి విమానంలో అక్రమంగా బెంగళూరుకు బంగారాన్ని తెస్తూ కెంపగౌడ ఎయిర్‌పోర్టులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(DRI) అధికారులకు రన్యారావు దొరికిపోయారు. నడుము చుట్టూ, కాళ్ల కిందిభాగం, షూలో 14 కేజీల బంగారాన్ని దాచారు. అయితే.. ఈ కేసు దర్యాప్తులోతుకు వెళ్లే కొద్దీ.. కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది చివర్లో రెండుసార్లు దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేసిన ఆమె.. దానిని తీసుకొని తాను స్విట్జర్లాండ్ వెళ్తున్నానని అక్కడి కస్టమ్స్ అధికారులకు వెల్లడించినట్లు తేలింది. ఆమె ప్రయాణ వివరాలను పరిశీలిస్తే, ఆమె భారత్‌కు వచ్చినట్లు వెల్లడైందని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తన అరెస్ట్ మెమోలో పేర్కొంది. అలాగే.. స్మగ్లింగ్ చేసే సమయంలో ఎయిర్‌పోర్టులో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై విచారణ జరపాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రరావు పేరును ఉపయోగించుకున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.







# దళిత విద్యార్థి వేళ్లు నరికేశారు

### కబడ్డీలో ఓడించినందుకు కిరాతకం

**తిరునల్వేలి:** తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో ఘోరం జరిగింది. పరీక్ష రాయడానికి వెళ్తున్న దేవేంద్రన్ అనే 11వ తరగతి విద్యార్థిపై కొందరు కిరాతకులు దాడి చేసి చేతి వేళ్లు దారుణంగా నరికేశారు. దిన కూలీ అయిన కొడుకైన దేవేంద్రన్ సోమవారం పాళయంకోటలోని పరీక్షా కేంద్రానికి బస్సులో బయలుదేరాడు. మార్గమధ్యంలో క్రాసింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులు బస్సును అడ్డగించారు. దేవేంద్రన్‌ను బయటికి లాగి ఎడమ చేతి వేళ్లు నరికేశారు. అడ్డొచ్చిన అతని తండ్రి గణేశ్‌పైనా దాడి చేశారు. అతనికి తల, ఇతర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు అడ్డుకోవడంతో అగంతకులు పారిపోయారు. తండ్రీకొడుకులను అదే బస్సులో శ్రీవైకుంఠం ప్రభుత్వాస్పత్రికి, తరువాత తిరునల్వేలి ఆస్పత్రికి తరలించారు. దాడికి తెగబడ్డ ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కబడ్డీ మ్యాచ్‌లో ఓటమికి ప్రతీకారంగానే దాడికి తెగబడ్డారని దేవేంద్రన్ కుటుంబం ఆరోపించింది.

# భారత విద్యార్థుల చూపు.. ఆ దేశాలవైపు!

### 2024లో బాగా తగ్గిన వైనం
**కెనడాకు 41 శాతం తగ్గుదల**
**బ్రిటన్‌కు 27, అమెరికాకు 13 శాతం**
**రష్యా, ఇతర దేశాలవైపు చూపు**

ఉన్నత విద్య కోసం అగ్ర రాజ్యాలకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు వెళ్తున్న వారి సంఖ్యలో భారీ తగ్గుదల నమోదైంది. ప్రత్యామ్నాయ దేశాలైన రష్యా, జర్మనీ, ఉజ్బెకిస్తాన్‌లకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం విశేషం! మొత్తంగా విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతోంది. 2023లో 8,92,989 మంది భారత విద్యార్థులు విదేశీ బాట పట్టగా 2024లో ఏకంగా 7,59,064కు తగ్గారు! అంటే దాదాపు 15 శాతం తగ్గుదల!!

### ఆ మూడు దేశాల్లో...

2024లో ఉన్నత విద్య కోసం వెళ్లిన అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 27 శాతం తగ్గినట్టు ఇమిగ్రేషన్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి. అంటే ఒక్క ఏడాదిలోనే ఏకంగా 1,64,370 తగ్గుదల! 2023లో కెనడాకు 2,33,532 మంది భారత విద్యార్థులు వెళ్లగా 2024లో 1,37,608కు తగ్గారు. అంటే 41 శాతం తగ్గుదల. బ్రిటన్‌కు 27 శాతం, అమెరికాకు 13 శాతం తగ్గుదల నమోదైంది. కఠినమైన వీసా నిబంధనలు, అధిక ఆర్థిక డిమాండ్లు, ఎక్కువ తిరస్కరణలు, దౌత్య సమస్యల వంటివి ఇందుకు కారణమని గణాంకాలు చెబుతున్నాయి.



### ఉద్రిక్తతలు...

ప్రధానంగా కెనడాతో భారత్‌కు దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరగడంతో ఉన్నత విద్యకు ఆ దేశాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్య బాగా తగ్గింది. సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య, అందులో భారత ప్రమేయం ఉందని కెనడా (Canada) ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలతో 2023 నుంచి పరిస్థితి దిగజారుతూ రావడం ఇందుకు కారణమైంది. వీటికి తోడు కెనడా తన వీసా, స్టూడెంట్ పర్మిట్ నిబంధనలను కఠినతరం చేసింది. బ్రిటన్‌లో నిబంధనలే అడ్డంకిగా మారాయి. పీజీ రీసెర్చ్, ప్రభుత్వ నిధులతో నడిచే పథకాల్లోని వారు మినహా ఇతర విదేశీ విద్యారులు తమ కుటుంబీకులను బ్రిటన్‌కు తీసుకురావడానికి వీల్లేదంటూ 2023లో నిబంధనలు తెచ్చింది. దాంతో ఉన్నత చదువులకోసం యూకేను ఎంచుకునే విద్యార్థుల సంఖ్య తగ్గింది.

### ఆ దేశాలవైపు చూపు

కొత్త దేశాలపై భారత విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2024లో అత్యధిక మంది విద్యార్థులు రష్యాకు వెళ్లారు! 2023తో పోలిస్తే 34 శాతం పెరుగుదల నమోదైంది. 2024లో జర్మనీకి 34,702 విద్యార్థులు పెరిగారు. ఉజ్బెకిస్తాన్‌కు 9,915 మంది, బంగ్లాదేశ్‌కు 8,864 మంది అధికంగా వెళ్లారు. కోవిడ్ తర్వాత విదేశాల్లో చదువుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం ఇది రెండోసారి.


# పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

### ఆర్టీఐ సమాచారంలో షాకింగ్ లెక్కలు

**రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదేళ్లలో 3,03,531 రోడ్డు ప్రమాదాలు**
**1.22 లక్షల మంది మృత్యువాత.. గాయపడ్డవారు 2.58 లక్షలు**
**ఆర్టీఐ సమాచారంతో వెలుగులోకి వివరాలు**

**ముంబై:** రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 1.22 లక్షల మంది మృత్యువాత పడగా 2.58 లక్షల మంది తీవ్రంగా గాయపడినట్లు ఆయా పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. ఇటు ట్రాఫిక్ పోలీసులు అటు ప్రాంతీయ రవాణా కార్యాలయాల (ఆర్టీఓ) అధికారులు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే డ్రైవర్లపై క్రమశిక్షణ పేరట ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఓ అధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు. కానీ ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్ల దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదని, తప్పంతా తమమీదే మోపడం అన్యాయ మని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా వెళుతున్న వాహనం ముందు ఆకస్మాత్తుగా గుంతలు ప్రత్యక్షం కావడం, రిపేరు వచ్చి రోడ్డుపై లేదా పక్కన నిలిపి ఉంచిన వాహనాల వల్ల అత్యవసరంగా బ్రేక్ వేయాల్సిన పరిస్థితి వస్తోందని చెబుతున్నారు. దీని వల్ల వాహనాలు ఒకదాన్నొకటి ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. కాగా పెద్ద ప్రమాదాలకు సంబంధించిన కేసులే పోలీసు స్టేషన్లలో నమోదవుతున్నాయి. వాటి వల్లే ప్రమాదాల సంఖ్య తెలుసుకునే అవకాశముంటుంది. చిన్నచిన్న ప్రమాదాల విషయంలో బాధితుడు, కారకుల మధ్య సయోధ్య కుదిరి కేసు పోలీసులదాకా వెళ్లని సందర్భాలు లక్షల్లో ఉంటాయి. ఇలా 2016 నుంచి 2024 డిసెంబరు వరకు గడచిన తొమ్మిదేళ్లలో 3,03,531 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 1,22,270 మంది మృతి చెందగా 2,58,723 మంది గాయపడినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలను బట్టి తెలిసింది. రోడ్డు ప్రమాదాల్లో దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరం మొదటి స్థానంలో ఉండగా మృతుల సంఖ్యకు సంబంధించి పుణే జిల్లా అగ్రస్థానంలో ఉంది. ముంబైలో 23,519 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 3,802 మృత్యువాత పడ్డారు. ఇక అతి తక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగిన జిల్లాగా సోలాపూర్ నిలిచింది.





మహా పత్రిక



WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 13-03-2025

# హనీరోజ్ అమాయకురాలేం కాదు.. దేనికైనా లిమిట్ ఉంటుంది: నటి ఫైర్

ఈ మధ్యకాలంలో హనీరోజ్ సినిమాలతో కన్నా వివాదాలతోనే తరచూ వార్తల్లో నిలుస్తోంది. తనపై అనుచిత వ్యాఖ్యలు చేశాడంటూ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో అతడిని అరెస్టు చేయగా తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ విషయంలో కొందరు హనీరోజ్‌కు మద్దతుగా నిలబడితే మరికొందరు ఆమెను తప్పుపట్టారు.

**దాని అర్థమేంటి?**

తాజాగా నటి ఫరా శిబిల హనీ పోరాటాన్ని ఓపక్క మెచ్చుకుంటూనే మరోపక్క ఆమె తీరుపై విమర్శలు గుప్పించింది. ఫరా మాట్లాడుతూ.. హనీరోజ్ వేషధారణను నేను తప్పుపట్టడం లేదు. కాకపోతే ఆమెను రకరకాల యాంగిల్స్‌లో తీసిన ఫోటోలను వీడియోలను తనే స్వయంగా షేర్ చేస్తోంది. దీని ద్వారా ఆమె ఏం చెప్పాలనుకుంటోందని మాత్రమే ప్రశ్నించాను. నేను వేసుకునే దుస్తులు అవతలివారికి అసౌకర్యంగా అనిపించకూడదు.

**అందరూ అదే పని!**

దేనికైనా కొన్ని హద్దులుంటాయి. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో అందరూ తమ శరీరాల్ని చూపిస్తూ ఎగ్జిబిషన్ పెట్టేస్తున్నారు. చాలామంది సోషల్ మీడియాలో ఇదే చేస్తున్నారు. నేను కూడా ఫోటోషూట్ చేశాను కదా అని ప్రశ్నిస్తారేమో! ఏదైనా ఐడియా నచ్చితేనే, చూడటానికి బాగుందనిపిస్తేనే ఆయా ఫోటోషూట్ చేస్తాను. కానీ ఇప్పుడు జనాలు కేవలం లోదుస్తులతో కోల్డ్ కాఫీ తయారు చేస్తూ వీడియోలు చేస్తున్నారు.

**అమాయకురాలేం కాదు**

హనీరోజ్ అమాయకురాలైతే కాదు.. తను తెలివైనది. తనేం చేస్తుందో తనకు బాగా తెలుసు. డబ్బు సంపాదించడం తప్పు కాదు.. కానీ ఇండస్ట్రీలో కష్టాలు ఎదుర్కొంటున్న ఎంతోమందికి ఆమె ఒక చెత్త ఉదాహరణగా నిలుస్తోంది. సినిమాలు లేకపోతే ఇలా శరీరాన్ని ఎగ్జిబిషన్‌గా పెట్టి డబ్బు సంపాదించుకోవాలని నేర్పిస్తోంది. మనపై మనకు నమ్మకం ఉండాలి. ప్రతిభను నమ్ముకోవాలి తప్ప శరీరాన్ని కాదు అని చెప్పుకొచ్చింది. మలయాళ బ్యూటీ హనీరోజ్ ఆలయం సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ఈ వర్షం సాక్షిగా, వీరసింహారెడ్డి చిత్రాల్లో నటించింది.



# ఒకప్పటి మావోయిస్టుల కంచుకోటలో మహేశ్ బాబు సినిమా షూటింగ్!

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్నటువంటి ఒడిశా లోని కొరాపుట్ జిల్లా నేడు సినిమా షూటింగ్స్‌తో సందడిగా మారింది. 15 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు దేశ ప్రజల దృష్టిని ఆకర్షించేవి. అయితే ప్రస్తుతం అంతా మారిపోయింది. ప్రకృతి అందాలకు ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంతం సినీ తారల ఆటపాటలతో కళకళలాడుతోంది. దీంతో ఒకప్పుడు ఈ ప్రాంతానికి బదిలీపై రావాలంటే భయపడిన అధికారులే నేడు బదిలీకి ముచ్చటపడుతున్నారు. లక్షలాది మంది దేశ, విదేశీయులు విహార యాత్రలకు కోసం తరలివస్తున్నారు.

**రాజమౌళి షూటింగ్ షురూ**

పాన్ ఇండియా దర్శకుడు రాజమౌళి కొద్దిరోజుల క్రితం సామాన్య వ్యక్తి మాదిరిగా విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో వస్తూ ఈ ప్రాంత అందాలను తిలకించారు. దీనిలో భాగంగా కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో స్టే చేశారు. ఇక్కడి అందాలను గమనించి తాను ప్రస్తుతం





సూపర్‌స్టార్ మహేష్ బాబుతో చేస్తున్న సినిమా షూటింగ్ షురూ చేశారు. దీంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ప్రస్తుతం సిమిలిగుడ ప్రాంతంలోని హోటళ్లలో గదులు దొరకడం లేదు. ఆంధ్ర సరిహద్దు సాలూరుకి కూతవేటు దూరంలో దేవమాలి పర్వతంపై ఈ సినిమా తీస్తున్నారు. అందువలన ప్రతిరోజూ ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి వందలాది మంది అభిమానులు తారలను చూసేందుకు తరలి వస్తున్నారు.

**తప్పని లీకుల గోల**

రాజమౌళి బృందం పటిష్ట చర్యలు తీసుకుంటున్నప్పటికీ లీకుల బెడద తప్పడం లేదు. మహేష్‌బాబుని విలన్ అనుచరులు నెట్టుకుంటూ వస్తుండగా, విలన్ వీల్ చైర్ మీద ఉండడం, మహేష్ బాబు అక్కడకి చేరడం వంటి వీడియోలు లీకయ్యాయి. ఇవి కొరాపుట్ జిల్లాలో, సోషల్ మీడియాలో ఆదివారం వైరల్ అయ్యాయి. ఒక వ్యక్తి సందర్శకుడి మాదిరిగా వచ్చి కారులో కూర్చుని ఈ వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేసినట్లు తెలుస్తోంది.



# చిల్లిగవ్వ లేదు.. ఆకలి తీర్చుకోవడం కోసం ఆ పని చేశాం: హీరోయిన్

మన కలలను సాకారం చేసుకోవాలంటే.. కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సిందే. ఇప్పుడు ఉన్నత స్థానంలో ఉన్నవాళ్లంతా ఒకప్పుడు ఎన్నో కష్టాలను భరించిన వాళ్లే. లక్ష్యాన్ని ఛేదించడం కోసం ఎన్నో అవస్థలతో పాటు అవమానాలను ఎదుర్కొన్నవాళ్లే. అందుకు నటి దియా మీర్జా కూడా అతీతం కాదు. మోడలింగ్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చిన దియా.. కెరీర్ తొలినాళ్లలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొందట. మోడల్‌గా రాణించేందుకు చాలా కష్టాలను భరించాల్సి వచ్చిందట. ఫ్యామిలీ సపోర్ట్ లేకుండా..చాలీ చాలని డబ్బులతోనే మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నట్లు తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. 'మోడలింగ్‌లోకి వెళ్తానని చెబితే ..ఫ్యామిలీ నుంచి అంతగా సపోర్ట్ అందలేదు. అయినా కూడా నా లక్ష్యం వైపే అడుగులు వేశాను. 2000లో నాతో పాటు ప్రియాంక చోప్రా, లారా దత్తా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నాం. ప్రియాంకకు ఫ్యామిలీ నుంచి ఫుల్ సపోర్ట్ ఉండేది. లారాకు, నాకు సపోర్ట్ చేయడానికి ఎవరూ ఉండేవాళ్లు కాదు. ముంబైలో లారా ఓ చిన్న ఇంట్లో అద్దెకు ఉండేది. నేను ముంబై వెళ్లిన ప్రతిసారి ఆమె ఇంట్లోనే ఉండేదాన్ని. డబ్బులు ఉండేవి కాదు. ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి ఖరీదైన దుస్తులు కొనేవాళ్లం కానీ..తినడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండేది కాదు. ఆకలి తీర్చుకోవడం కోసం నూడుల్స్ తినేవాళ్లం. మా పరిస్థితి తలుచుకొని మేమే నవ్వుకునేవాళ్లం. ఖరీదైన దుస్తులు వేసుకున్నా..తినేది మాత్రం నూడుల్స్' అని అనుకునేవాళ్లం' అని దియా నాటి దీన కథను గుర్తు చేసుకొని ఎమోషనల్ అయింది. కాగా, 2000లో జరిగిన మిస్ ఇండియా పోటిల్లో లారా దత్తా విజేతగా నిలవగా.. ఫస్ట్ రన్నరప్‌గా ప్రియాంక, సెకండ్ రన్నరప్‌గా దియా మీర్జా నిలిచారు. 2001లో 'రెహ్నా హై తేరే దిల్ మే'మూవీతో దియా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అనంతరం బాలీవుడ్ లో వరుస సినిమాలు చేసింది. ఇక 2021 లో విడుదలైన ' వైల్డ్ డాగ్' అనే తెలుగు సినిమాలో కూడా ఈమె నటించారు. నటిగా, మోడల్‌గా, సమాజ సేవకురాలిగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఈమెకు 2012లో ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిలిం అకాడమీ 'గ్రీన్ అవార్డు' లభించింది.

# రికార్డు సృష్టించిన డాకు బ్యూటీ.. ఆ కారు కొన్న మొట్టమొదటి నటిగా..

బాసూ.. వేర్ ఈజ్ ద పార్టీ.. అంటూ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఊర్వశి రౌతేలా. ఐటం సాంగ్స్‌కు పెట్టింది పేరైన ఈ బ్యూటీ ఏజెంట్, బ్రో, స్కంద చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించింది. ఇటీవలే డాకు మహారాజ్ మూవీలో కీలక పాత్రలో నటించడంతో పాటు దబిడి దిబిడి పాటతో సెన్సేషన్ సృష్టించింది.


**కారు విలువ అన్ని కోట్లా?**

భారత్‌లో ఏ నటికి సాధ్యం కాని రీతిలో ఏకంగా రూ.12 కోట్లు పెట్టి రోల్స్ రాయిస్ కులినన్‌ను కొనుగోలు చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇదే నిజమైతే ఈ కారు సొంతం చేసుకున్న మొట్టమొదటి నటిగా ఊర్వశి రికార్డుకెక్కనుంది. అలాగే ఇన్‌స్టాగ్రామ్ ఫోర్బ్స్ రిచ్ లిస్ట్‌లోనూ స్థానం దక్కించుకున్నట్లు భోగట్టా! ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో వెల్‌కమ్ టు ద జంగిల్, కసూర్ 2 చిత్రాలున్నాయి. ఊర్వశి ఇటు సినిమాల్లో యాక్ట్ చేస్తూ, స్పెషల్ సాంగ్స్ చేయడమే కాకుండా ప్రైవేట్ సాంగ్స్ కూడా చేస్తూ ఉంటుంది.

**విమర్శలపాలైన ఊర్వశి**

డాకు మహారాజ్ సినిమా రూ.100 కోట్లపైనే వసూళ్లు రాబట్టినప్పుడు ఊర్వశి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయింది. తన సినిమా సెంచరీ దాటిందని గర్వపడిపోయింది. బాలీవుడ్ హీరో సైఫ్ అలీ ఖాన్ దాడి గురించి స్పందించమన్నప్పుడు కూడా డాకు మహారాజ్ సినిమా గురించి చెప్తూ సొంత డబ్బా కొట్టుకుంది. ఈ సినిమా విజయం తర్వాత తనకు తల్లి డైమండ్ రింగ్ గిఫ్ట్ ఇచ్చిందని చూపించింది. ఇలాంటివి చేతికి ధరించి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉందని కామెంట్స్ చేసింది. సైఫ్‌పై సానుభూతి చూపించకుండా తన బహుమతులను చూపిస్తూ షోఆఫ్ చేయడంపై నెట్టింట తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆమె తన తప్పిదం తెలుసుకుని సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు చెప్పింది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS





# బీసీసీఐ చెప్పిందంతా ఐసీసీ చేస్తుంది

## విండీస్ దిగ్గజ బౌలర్ సంచలన ఆరోపణలు

ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా గెలవడాన్ని పాకిస్తాన్ వాళ్లే కాకుండా ఇతర దేశాల వాళ్లు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. మెగా టోర్నీలో టీమిండియా తమ మ్యాచ్‌లన్నీ ఒకే వేదికపై ఆడి లబ్ధి పొందిందని కొన్ని భారత వ్యతిరేక శక్తులు అవాక్కులు చవాక్కులు పేలుతున్నాయి. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ప్రాతినిథ్యమే లేని విండీస్ కూడా ఈ అంశంపై నోరు మెదపడం మొదలుపెట్టింది. భారత్ దుబాయ్‌లోనే తమ మ్యాచ్‌లన్నీ ఆడటాన్ని విండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ ఆండీ రాబర్ట్స్ తప్పుబట్టాడు. మిగతా జట్లు మైళ్లకు మైళ్లు ప్రయాణించి మ్యాచ్‌లు ఆడితే, టీమిండియా మాత్రం కాలు కదపకుండా ఒకే వేదికపై అన్ని మ్యాచ్‌లు ఆడిందని అన్నాడు. టోర్నీకి ఆతిథ్యమిచ్చినా పాకిస్తాన్ కూడా టీమిండియాతో మ్యాచ్‌కు దుబాయ్‌కు వెళ్లిందని గుర్తు చేశాడు. ఇలాంటప్పుడు పాక్ జట్టుకు ఆతిథ్య సౌలభ్యం ఎక్కడ లభించిందని ప్రశ్నించాడు. ఒకే వేదికపై టీమిండియా మ్యాచ్‌లు షెడ్యూల్ చేసినందుకు ఐసీసీపై కూడా ధ్వజమెత్తాడు. బీసీసీఐ ప్రతి కోరికను తీర్చడాన్ని ఐసీసీ మానుకోవాలని సూచించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తటస్థ వేదిక (దుబాయ్) విషయంలో ఐసీసీ బీసీసీఐకి అనుకూలంగా వ్యవహరించిందని మండిపడ్డాడు. ఒకే వేదికపై అన్ని మ్యాచ్‌లు ఆడటం ద్వారా టీమిండియా లబ్ధి పొందిందని ఆరోపించాడు. ఈ విషయంలో మిగతా జట్లకు అన్యాయం జరిగిందని వాపోయాడు. ఇకనైనా ఐసీసీ బీసీసీఐకి సహకరించడం మానుకోవాలని అన్నాడు. 2024 టీ20 వరల్డ్‌కప్‌లోనూ ఓ విషయంలో ఐసీసీ బీసీసీఐకి సహకరించిందని నిరాధార ఆరోపణ చేశాడు. టీమిండియా కోసం బీసీసీఐ చేసే ప్రతి అభ్యర్థనను నెరవేర్చకూడదని ఐసీసీకి సూచించాడు. అప్పుడప్పుడైనా బీసీసీఐకి నో చెప్పాలని వ్యంగ్యంగా అన్నాడు. ప్రపంచంలో బీసీసీఐ ధనిక బోర్డు కావడంతో ఐసీసీ వారి చెప్పినట్టల్లా ఆడుతుందని అన్నాడు. తనవరకు ఐసీసీ అంటే ఇండియన్ క్రికెట్ బోర్డు అని ఎద్దేవా చేశాడు. బీసీసీఐ ప్రతి విషయంలో ఐసీసీని శాశిస్తుందని తెలిపాడు. రేపటి రోజుల్లో బీసీసీఐ నో బాల్స్ వద్దు, వైడ్ బాల్స్ వద్దన్నా ఐసీసీ తలూపుతుందని అన్నాడు.

బీసీసీఐని తృప్తి పరిచేందుకు ఐసీసీ ఏమైనా చేస్తుందని అన్నాడు. 74 ఏళ్ల ఆండీ రాబర్ట్స్ తొలి మూడు వన్డే ప్రపంచకప్ టోర్నీల్లో విండీస్ జట్టులో కీలక సభ్యుడిగా ఉన్నాడు. ఈ మూడింటిలో విండీస్ తొలి రెండు ప్రపంచకప్‌లను గెలిచింది. 1983 వరల్డ్‌కప్‌లో కపిల్ దేవ్ నేతృత్వంలోని భారత జట్టు ఫైనల్లో విండీస్‌ను చిత్తు చేసి ఛాంపియన్‌గా అవతరించింది. నేడు రాబర్ట్స్ చేసిన వ్యాఖ్యలు నాటి ప్రపంచకప్ అవమానాన్ని దృష్టిలో పెట్టుకుని చేసినట్లుంది. కాగా, రాబర్ట్స్ లేవనెత్తిన విషయాన్నే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ అథర్టన్ కూడా లేవనెత్తాడు. ఒకే వేదికపై ఆడి, ఎలాంటి ప్రయాణ బడలికలు లేకుండా టీమిండియా లబ్ధి పొందిందని సోషల్‌మీడియా వేదికగా ఆరోపించాడు.

అయితే ఒకే వేదికపై మ్యాచ్‌లు ఆడటం వల్ల టీమిండియాకు అదనంగా ఒరిగిందేమీ లేదని పాక్ మాజీ కెప్టెన్ వసీం అక్రం అనడం విశేషం. ఈ టోర్నీలో భారత్ వేదికతో సంబంధం లేకుండా చాలా బలంగా ఉండిందని అక్రం అన్నాడు. ఈ జట్టుతో భారత్ పాకిస్తాన్‌లో కూడా గెలిచేదని తెలిపాడు. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడి అన్నింటా విజయాలు సాధించింది. ఫైనల్లో టీమిండియా న్యూజిలాండ్‌ను చిత్తు చేసి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. వాస్తవానికి ఈ టోర్నీకి పాక్ ఆతిథ్యమిస్తున్నప్పటికీ.. భద్రతా కారణాల రీత్యా టీమిండియా పాక్‌లో పర్యటించడానికి బీసీసీఐ ఒప్పుకోలేదు. సుదీర్ఘ చర్చల అనంతరం ఐసీసీ టీమిండియా మ్యాచ్‌లను దుబాయ్‌కు మార్చింది.

# హెడ్ కోచ్‌కు గాయం

## రాజస్థాన్ రాయల్స్ పోస్ట్ వైరల్




తమ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ గాయంపై రాజస్తాన్ రాయల్స్ అప్‌డేట్ అందించింది. 'ది వాల్' కోలుకుంటున్నాడని.. త్వరలోనే పూర్తిస్థాయిలో టీమ్‌తో చేరతాడని తెలిపింది. కాగా ఇటీవల ద్రవిడ్ క్లబ్ క్రికెట్ ఆడిన విషయం తెలిసిందే. తన చిన్న కుమారుడు అన్వయ్‌తో కలిసి నసుర్ మెమొరియల్ షీల్డ్ టోర్నీలో ద్రవిడ్ పాల్గొన్నాడు. యంగ్ లయన్స్ క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడిన ద్రవిడ్ 10 పరుగులు చేసి అవుటయ్యాడు. అయితే, ఈ మ్యాచ్ సందర్భంగానే రాహుల్ ద్రవిడ్ గాయపడినట్లు సమాచారం. దీంతో రాజస్తాన్ రాయల్స్ ముందస్తు శిక్షణా శిబిరంలో పాల్గొనలేకపోయాడు.

### కాలికి కట్టు అలాగే ఉండటంతో

అయితే, తాజాగా అతడు జట్టుతో చేరాడు. ఈ విషయాన్ని రాజస్తాన్ రాయల్స్ బుధవారం వెల్లడించింది. ''బెంగళూరులో క్రికెట్ ఆడుతున్న సమయంలో గాయపడిన మా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కోలుకుంటున్నారు. ఈరోజే జైపూర్‌లో ఆయన మాతో చేరతారు'' అని ట్వీట్ చేసింది. ఈ సందర్భంగా రాయల్స్ జెర్సీలో థమ్సప్ సింబల్ చూపిస్తున్న ద్రవిడ్ ఫొటోను పంచుకుంది. అయితే, అతడి ఎడమకాలికి ఇంకా కట్టు ఉండటం గమనార్హం. ఇక ఈ ఫొటో వైరల్‌గా మారగా.. నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తున్నారు. ఆటగాళ్లు గాయపడ్డారనే వార్తలు చదివాం గానీ.. ఇలా హెడ్ కోచ్‌కు ఇంజూరీ కావడం ఇదే తొలిసారి కావొచ్చు అంటూ సరదా వ్యాఖ్యలు చేస్తున్నారు. 'వాల్' కాస్త పెద్దవాడైపోయాడని.. క్రికెట్ ఆడే సమయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలంటూ హితవుపలుకుతున్నారు.

# అదే జరిగితే బుమ్రా కెరీర్ ముగిసినట్లే

## కివీస్ మాజీ పేసర్ వార్నింగ్



న్యూజిలాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ షేన్ బాండ్ భారత క్రికెట్ జట్టు యాజమాన్యానికి కీలక సూచన చేశాడు. టీమిండియా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై పనిభారం తగ్గించాలని సూచించాడు. లేదంటే ప్రపంచకప్ నాటికి అతడు అందుబాటులో ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డాడు. కాగా క్రికెటర్లలో గాయాల బెడద ఎక్కువగా ఉండేది ఫాస్ట్‌బౌలర్లకే. బుమ్రా కూడా ఇందుకు అతీతం కాదు. గతంలో చాలాసార్లు అతడు వెన్నునొప్పితో బాధపడ్డాడు. ఈ క్రమంలో టీ20 ప్రపంచకప్2022 వంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు దూరమయ్యాడు. ఏడాది పాటు జట్టు అతడి సేవలను కోల్పోయింది. అనంతరం వన్డే వరల్డ్‌కప్2023 నాటికి తిరిగి జట్టుతో చేరిన బుమ్రా.. టీమిండియా టీ20 ప్రపంచకప్2024 గెలవడంలో కీలక పాత్ర పోషించాడు.

**తాత్కాలిక కెప్టెన్‌గా**

ఆ తర్వాత కూడా జట్టుతో కొనసాగిన ఈ రైటార్మ్ పేసర్.. ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా మరోసారి గాయపడ్డాడు. కంగారూ దేశ టూర్‌లో భాగంగా తొలి టెస్టుకు, ఆఖరి టెస్టుకు బుమ్రా తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ క్రమంలో చివరిదైన ఐదో టెస్టులో భాగంగా వెన్నునొప్పితో విలవిల్లాడిన బుమ్రా ఆస్పత్రికి వెళ్లి స్కానింగ్ చేయించుకున్నాడు. ఇక ఈ టూర్ ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత కూడా బుమ్రా కోలుకోలేదు. ఫిట్‌నెస్ సాధించని కారణంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ2025 మొత్తానికి దూరమయ్యాడు. ఈ పరిణామాల నేపథ్యంలో కివీస్ మాజీ పేసర్ షేన్ బాండ్ మాట్లాడుతూ... ''అతడొక విలువైన బౌలర్. వచ్చే వరల్డ్‌కప్‌లో అతడి పాత్ర కీలకం. అయితే, త్వరలోనే టీమిండియా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టులు ఆడబోతోంది. నేను గనుక టీమిండియా మేనేజ్‌మెంట్ స్థానంలో ఉంటే.. అతడిని వరుసగా రెండు టెస్టుల్లో ఆడించను. ఐపీఎల్ తర్వాత వెనువెంటనే వరుస టెస్టులు ఆడించడం పెద్ద రిస్క్.

**అదే జరిగితే బుమ్రా కెరీర్ ముగిసినట్లే**


అలా కాకుండా మధ్యలో కాస్త విశ్రాంతినిస్తే అతడు ఫిట్‌గా ఉండేందుకు అవకాశం ఉంది. మిగతా ఫార్మాట్లలోనూ ఆడగలుగుతాడు. జట్టులోని ప్రధాన, అత్యుత్తమ బౌలర్ ప్రతిసారి గాయం వల్ల ప్రతిష్టాత్మక ఈవెంట్లకు దూరం కావడం మంచిదికాదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# జనసేన జయకేతనం

## ఆవిర్భావ సభకు నామకరణం చేసిన పవన్

### మార్చి 14న ఆవిర్భావ సభ



**మహా :** ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు 'జయకేతనం' అని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. ఈ విషయాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గం లోని చిత్రాడ వద్ద జనసేన పార్టీ నిర్వహిస్తున్న 'జయకేతనం' సభ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి జనసైనికులు, వీర మహిళలు తరలిరానున్నారని... ఇతర రాష్ట్రాల నుంచి కూడా జనసైనికులు, ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళ నాడుల నుంచి సైతం పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జరిగే ఈ సభ స్థానిక చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా ఉంటుందని మనోహర్ తెలిపారు. ఈ ప్రాంతానికి విశేష సేవలందించిన మహానుభావులను స్మరించుకునే విధంగా మూడు ముఖద్వారాలకు వారి పేర్లు పెట్టామని ఆయన వెల్లడించారు. తొలి ద్వారానికి పిఠాపురం మహారాజు శ్రీ రాజా సూర్యరావు బహదూర్ పేరు పెట్టామని తెలిపారు. ఆయన విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు ఎనలేని కృషి చేశారని వివరించారు. రెండవ ద్వారానికి రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు సహాయం చేసిన దొక్కా సీతమ్మ పేరు పెట్టామని వెల్లడించారు. ఇక మూడవ ద్వారానికి విద్యాసంస్థలు స్థాపించి చరిత్ర సృష్టించిన మల్లాది సత్యలింగం నాయకర్ పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ ముగ్గురు మహానుభావులు ఆయా ప్రాంతాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మనోహర్ పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు జనసేనకు అఖండ విజయాన్ని అందించారని మనోహర్ అన్నారు. పోటీ చేసిన ప్రతి స్థానంలో జనసేన విజయం సాధించిందని, ఇది జనసైనికులు, వీర మహిళలు, నాయకుల నిస్వార్థ సేవలకు ఫలితమని ఆయన కొనియాడారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, పిఠాపురం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 14న జరిగే ఈ సభలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని ఆయన వివరించారు.



## రెండేళ్ళలో వరంగల్ ఎయిర్ పోర్టుకు విమానాలు

### రామగుండం , ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ లపై చర్చిస్తున్నాం.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, మహా:** రెండు సంవత్సరాలలో వరంగల్ ఎయిర్ పోర్ట్ లో ఫ్లైట్ ఎగురుతుందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్ చాట్ చేసిన ఆయన 18 నెలల్లో ఉప్పల్ నారపల్లి ఫ్లై ఓవర్ పూర్తి చేస్తామన్నారు. రామగుండం , ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ల గురించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో చర్చించామన్నారు.

## మోత్కూరు ను అభివృద్ధి చేసింది

# బీఆర్ఎస్ ప్రభుత్వంమే



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రం గుమ్మడికాయ దొంగ ఎవరంటే మేమేఅన్నట్లు ఎందుకుభుజాలు తడు ముకుంటున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి. మండల పార్టీ అధ్యక్షులు, పొన్నెబోయినరమేష్. మున్సిపాలిటీఅధ్యక్షులు జంగ శ్రీనివాస్ సర్పంచ్ ఫోరంరాష్ట్ర కార్యదర్శిరాంపాక నాగయ్యలు అన్నారు.కాంగ్రెస్ మండల నాయకులు ప్రతిపక్షంగా మేము అడిగినదానికి సమాధానం చెప్ప కుండా వంకర టింకర మాటలెందుకు.మేము మీరు ఇలా ప్రెస్ మీట్ పెట్టడం కాదు బహిరంగ చర్చకు కూర్చుందాం. బ్యాంకు చైర్మను పేలపూడి వెంకటేశ్వర్లు ఎందుకు ఎగిరెగిరి పడుతున్నాడు మేముఅడిగింది ఏమిటి, నువ్వు చెప్తున్న సమాధానం ఏమిటి, దుకాణ సముదాయమునకు మొత్తం అందాదా 60 లక్షలు రూపాయలు ఖర్చు అయితే నీవు కట్టించిన బాత్రూం కే 12 లక్ష రూపాయలు అవుతాయా. కంచర్ల అశోక్ రెడ్డి హయాంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే నువ్వు వచ్చినాక మూడు కేంద్రాల ఎందుకయ్యాయి, ఆర్భాటంగా ఎమ్మెల్యే ప్రారంభించిన కందుల కొనుగోలు కేంద్రంలో ఒక గింజఎందుకుకొనలేదు అదినీ అసమర్ధతకాదా. పెట్రోల్ బంక్ లో 50 లక్షలు వృధా ఖర్చు అన్నావ్ ఆ పెట్రోల్ బంకుకు 14 లక్షల కన్నా ఎక్కువ కాలేదు. కంచర్ల హయాంలో అవినీతి జరిగిందిఅన్నావు వారు చైర్మన్లు గా ఉన్నప్పుడు మీ కుటుంబం నుండే కదా వైస్ చైర్మన్ గా ఉన్నదిఅవినీతి నిజమైతేఅప్పుడెందుకు ప్రశ్నించలేదు, దానిలో ఉన్న మతలమేమిటి.?వీటికి సమాధానం చెప్పండి, కాంగ్రెస్ లో మేమంతా ఒక్కటే అంటున్నారుఒక్కటే అయితే ఎల్ ఎన్ గార్డెన్ లో జరిగిన సమావేశానికి మీరెందుకుపోలేదు మొన్న జరిగిన ప్రెస్ మీట్ లో వారెందుకు రాలేదు. మున్సిపాలిటీ రోడ్డు విషయంలో గాదరి కిషోర్ కుమార్ గారు 50 ఫీట్ల రోడ్డు ప్రతిపాదనచేస్తే వ్యాపారస్తులకోరికమేరకు 40 ఫీట్ వరకు కుందించచబడ్డది . ప్రతిపక్షంగా అడిగే హక్కు మాకుంది ప్రభుత్వపరంగా సమాధానం చెప్పే బాధ్యత మీకు ఉంటది సమాధానం చెప్పచేతకాకఎదురుదాడి చేస్తామంటే మేము కూడా సిద్ధం ఇకనైనా జ్ఞానోదయం తెచ్చుకుని ప్రభుత్వంఇచ్చిన ఆరుగ్యారెంటీఅమలుకోసం మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసందృష్టి పెట్టండి

# స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఎన్నికలు వెంటనే నిర్వహించాలని భాజపా జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాలలో సర్పంచులు.ఎంపీటీసీలు పదవీకాలం ముగిసి ఏడాది దాటిన నేటికి ఎన్నికల నిర్వహించకపోవడం వల్ల గ్రామాలలో అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు.దేశంలో ఏ ఎన్నికలు జరిగిన వెంటనే 6నెలల లోపు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నిక సంఘం నిబంధన పక్కకు పెట్టి తుంగలో కులగణన చేస్తున్నామని దొంగ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో (బాజపా) జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షులు, గుదే మధుసూదన్ యాదవ్, పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరూ ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

### విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి.. కలెక్టర్ సందీప్

### ఎంపీడీఓ కార్యాలయం, పీ.హెచ్.సీ, టీ.జీ.ఆర్.ఎస్ విద్యాలయం తనిఖీ

**సిరిసిల్ల, మహా:** జిల్లాలోని అర్హులందరూ ఎల్ ఆర్ ఎస్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. తంగళ్లపల్లి మండలకేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రజాపాలన కౌంటర్ ను పరిశీలించి, ఎన్ని అప్లికేషన్లు వచ్చాయి? వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీ ఫైబర్ సర్వర్ రూం ను పరిశీలించి, మండలంలో ఇంటి, ఇతర పన్నుల వసూలు పై ఆరా తీశారు. మండలంలో భూముల క్రమబద్ధీకరణకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ? వాటి లో ఎన్ని అప్రూవ్ అయ్యాయని ఎంపీడీఓ లక్ష్మీనారాయణను ఆరా తీయగా, మొత్తం 2893 దరఖాస్తులు అప్రూవ్ అయ్యాయని కలెక్టర్ దృష్టికి ఎంపీడీఓ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కలిపించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారులకు పిలుపు ఇచ్చారు. ప్రతి దరఖాస్తుదారుడికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని నేరుగా.. వారు అందుబాటులో లేకపోతే ఫోన్ ద్వారా సంప్రదించాలని అధికారులు, సిబ్బంది సూచించారు. ఇంటి, ఇతర పన్నులను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీఓ మీర్జా తదితరులు పాల్గొన్నారు.

**పరిసరాలు శుభ్రంగా ఉండాలి**

తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపీ,ఇతర రిజిస్టర్లు పరిశీలించారు. మందులు ఇచ్చే గది, ల్యాబ్ తనిఖీ చేసి, మందులు, వ్యాక్సిన్ ల పై ఆరా తీశారు. ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వైద్యురాలు చంద్రికా రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని టీజీఆర్ఎస్ (గర్ల్స్) విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు రాగి జావ ఇస్తుండగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారని ప్రిన్సిపాల్ రాధను ఆరా తీయగా, బగార అన్నం, ఆలు గడ్డ కూర, టమాటా, ఉడికించిన గుడ్డు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.




## దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ

**కరీంనగర్, మహా:** అలీం కో సంస్థ సహకారంతో, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని భవిత కేంద్రాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయ ఉపకారణాలను పంపిణీ చేశారు. ముఖరం పురాలోని భవిత కేంద్రంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దివ్యాంగ విద్యార్థులకు సహాయపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని భవిత కేంద్రాలలో దివ్యాంగుల ఆలనా పాలన చూస్తున్న సిబ్బంది సేవలు గొప్పవని కొనియాడారు. 108 మంది పిల్లలకు సహాయ ఉపకరణాలు అవసరంగా గుర్తించి, కాలిపర్, వీల్ చైర్, ట్రై సైకిల్ వంటి ఉపకరణాలు అందజేశామని తెలిపారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. భవిత సిబ్బందికి కేంద్రంలో ఎలాంటి అవసరం ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, అలీమ్ కో సంస్థ ప్రతినిధులు, భవిత కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పై అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలి

### రిలే నిరాహార దీక్ష నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జుట్టు సతీష్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను నిర్వహించడం జరిగింది. ఎస్సీ వర్గీకరణపై మొండి వైఖరి వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించేంత వరకు గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, హాస్టల్ వెల్ఫేర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ల తుది ఫలితాలను వాయిదా వేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ సిద్దాపురం శ్రీకాంత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నర్కుడి అంజయ్య మాదిగ, ఇబ్రహీంపట్నం మండల ఉపాధ్యక్షులు కంబాలపల్లి సురేందర్, మండల కార్యదర్శి పంది నరేందర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నరాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

**వరంగల్, మహా:** హనుమకొండ జిల్లాలో బుధవారం కమలాపురం మండలం నర్సక్కపల్లి వద్ద ట్రాలీ ఆటో బోల్తా పడి రోడ్డు ప్రమాదానికి గురైన 20 మంది మహిళా కూలీలకు గాయాలైన విషయం తెలుసుకొని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈటెల రాజేందర్ వెంట బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, జిల్లా నాయకులు, తదితరులు ఉన్నారు.

## జాతీయ సాంస్కృతిక విభాగంలో విద్యార్థికి ప్రథమ బహుమతి

### దేశ నలుమూలల ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల ఖ్యాతి

### విద్యార్థి బలరాంను అభినందించిన ప్రిన్సిపాల్ అధ్యాపకులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఒరిస్సాలోని బరంపూర్ లో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం విద్యార్థి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ నేనావత్ బలరాం చక్కని ప్రతిభ కనబరిచి సాంస్కృతిక విభాగంలో ప్రథమ బహుమతి పొందారు. ఈనెల 3 నుంచి 9 వరకు ఒరిస్సాలోని బరంపూర్ యూనివర్సిటీ వేదికగా జరిగిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో, వివిధ రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం విద్యార్థి బలరాంతో పాటు ఆరుగురు విద్యార్థుల బృందం రాష్ట్రం తరపున శిబిరంలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి అయిన బోనాలు, బతుకమ్మ ఆటపాట, పోతరాజు విన్యాసాలను ప్రదర్శించారు. ఈ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక విద్యార్థి బలరాంను అభినందించారు. అనంతరం



ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో, సాంస్కృతిక పోటీలలో రాణించాలని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి పొంది, ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల ఖ్యాతిని దేశం అంతట తెలిసేలా చేసిన విద్యార్థి బలరాంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్ రమేష్, డాక్టర్ రాకేష్ భవాని, డాక్టర్ రచన మరియు అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు బలరాంకు అభినందనలు తెలియజేశారు.



## పోగొట్టుకున్న బంగారు గొలుసును అప్పగించిన పోలీసులు

**హన్మకొండ, మహా;** భూపాలపల్లి వాస్తవ్యురాలు అయిన సంగి నిచ్చిత నిత్యవసర వస్తువులు కొనుగోలు నిమిత్తం తేదీ.10/3/ 2025 తేదీ హన్మకొండలోని డిమార్ట్ షాపింగ్ మాల్ కు వెళ్లగా వస్తువులు కొనుగోలు చేస్తుండగా ఆమె మెడలో ఉన్న ఆరు గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. డిమార్ట్ సిబ్బందిని అడగగా సీసీ కెమెరాలు రికార్డు అవ్వలేదని తెలిపినారు. వెంటనే సుబేదారి పోలీస్ స్టేషన్ కి ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి కి ఫిర్యాదు చేయగా పోలీస్ కానిస్టేబుల్ ఎండి లియాఖత్ ఆలీ వెంటనే స్పందించి త్వరితగతిన సంగి నిశ్చిత పోగొట్టుకున్న 6 గ్రాముల బంగారు గొలుసును వెతికి తేదీ.12/3/25 రోజున ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అప్పగించనైనది. కానిస్టేబుల్ యండి లియాఖత్ ఆలీని ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ రెడ్డి అభినందించారు.

# మంథన్ గౌరెల్లి గ్రామాని పోర్త్ సిటీలో కలపాలి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు
- గ్రామాల అభివృద్ధి ఫోర్త్ సిటీతోనే సాధ్యం
- మంతన్ గౌరెల్లి కేసీ తండా గ్రామాల ప్రజలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇటీవల ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోర్త్ సిటీలో మంథన్ గౌరెల్లి గ్రామం పేరు లేకపోవడంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలంలో గిరిజన ప్రాతంగా పేరుగాంచిన మంథన్ గౌరెల్లి, కేసి తండా అభివృద్ధిలో వెనుకబడింది. నాగార్జునసాగర్ హైవేకు అతి చేరువలో ఉన్న, మంథన్ గౌరెల్లి, కేసి తండా గ్రామపంచాయతీలు పోర్త్ సిటీలో గ్రామాల పేర్లు లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందారు. మా రెండు గ్రామాలను పోర్త్ సిటీలో కలపాలని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు



వినతి పత్రం అందజేశారు. ఇట్టి విషయంపై అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావన తీసుకువచ్చి గిరిజన ప్రాంత ప్రజలకు న్యాయం చేకూరేలా, ప్రాంతం అభివృద్ధి చెందేలా చర్చ జరపాలని ఎమ్మెల్యేను కోరారు.

**సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే....**

గ్రామాల ప్రజలు అందజేసిన వినతి పత్రానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కచ్చితంగా మీకు న్యాయం చేస్తానని హామీ ఇస్తూ, మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని, ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన మాజీ వైస్ ఎంపీపీలు కొడవకంటి శ్రీనివాస్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, దేందీ రామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొర్ర అరవింద్ నాయక్, ఇదులకంటి లక్ష్మిపతి గౌడ్, లిక్కి రాజి రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కదారి యాదయ్య, సభవత్ మధుకర్ మాజీ వార్డు సభ్యులు యాట శ్రీనివాస్, పూజ రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబనాగోని సోమయ్య, పెరుమాండ్ల యాదయ్య, కరంటోత్ సీత, రామావత్ హరి సింగ్ సేవాలాల్, జగదీష్ పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) కమిటీని రద్దు చేయాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఓ మాజీ మంత్రి పీఆర్వోను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సిగ్గుచేటని, జిల్లా టీయూడబ్ల్యూజే నూతన కమిటీని పునః పరిశీలించి వెంటనే రద్దు చేయాలని రంగారెడ్డి జిల్లా సీనియర్ జర్నలిస్టులు రఘుపతి, గణేష్ లు రాష్ట్ర కమిటీకి సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే సంఘానికి చెందిన జిల్లా జర్నలిస్టుల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్టు రఘుపతి మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లిలో జరిగిన టీయూడబ్యూజే రంగారెడ్డి జిల్లా మహాసభ ఏకపక్షంగా, నియంతృత్వ పోకడలతో జరిగిందని విమర్శించారు. ఒకే వర్గానికి పెద్దపేట వేస్తూ ఒక ప్రాంతానికి, మరికొంత మంది జర్నలిస్టు నాయకుల అనుచరులకు పదవులు కట్టబెడుతూ అన్యాయంగా వ్యవహరించారని ఆరోపించారు. ఓ బీఆర్ఎస్ మాజీ మంత్రి పీఆర్వో సలీంను నూతన కమిటి జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సిగ్గుచేటన్నారు. ఎంతోమంది జర్నలిస్టులు దీనిని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. గతంలో అప్పటి ప్రభుత్వం జర్నలిస్టు వ్యతిరేఖ కార్యకలాపాలపై జిల్లా వ్యాప్తంగా తాము స్పందించామని, రాష్ట్రస్థాయి నాయకులు దేవులపల్లి అమర్, విరాహత్ అలీ, సత్యనారాయణ, నరేందర్ రెడ్డి లాంటి నాయకుల పిలుపుకు శిరసావహించి ఎన్నో కార్యక్రమాలలో పాలు పంచుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నో కష్ట నష్టాలను జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఖుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, తాండూరు, రాజేంద్రనగర్, చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, షాద్ నగర్, ఎల్బీనగర్ తదితర నియోజకవర్గాల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై స్పందించడం



జరిగిందని పేర్కొన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన శ్రీకాంత్ రెడ్డిని సుదీర్ఘంగా పదేళ్లపాటు జిల్లా అధ్యక్షునిగా నియమించినప్పటికీ తాము సహకరించామని అంతకుముందు వెంకట్ రెడ్డికి కూడా సహకరించామని ఇప్పుడు మరోసారి ఓసి వర్గానికి చెందిన సలీం ఏకపక్షంగా రాత్రిపూట ఎన్నుకున్నారని, సీనియర్ జర్నలిస్టుల సూచనలు సలహాలు తీసుకోకుండా నియమించడం సబబు కాదన్నారు. శ్రీకాంత్ రెడ్డి నియంతృత్వ పోకడలతో జిల్లాలో అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులను గ్రూపులుగా విభజించి పాలించారని, వాస్తవాలు తెలియకుండా రాష్ట్రస్థాయి నాయకులను పక్కదారి కూడా పట్టించారని విమర్శించారు. శ్రీకాంత్ రెడ్డి తన అనుచరులకు, తనకు తాబేదార్లుగా ఉన్న వారిని సంఘంలో నియమించుకొని తన వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉన్న వారిని కమిటీ పదవుల్లో నియమించారని తీవ్రంగా ఆరోపించారు. యూనియన్ లో ఏళ్ల తరబడి పనిచేసిన సీనియర్ జర్నలిస్టులకు సన్మాన సత్కారాలు లేకుండా నిన్న మొన్న ఈ రంగంలో అడుగుపెట్టిన వారిని కూడా అందలమెక్కించి సన్మానాలు చేయడం విడ్డూరంగా ఉందని, ఎంతో మంది జర్నలిస్టులు దీనికి బాధపడ్డారన్నారు. శ్రీకాంత్ రెడ్డి స్వార్థ బుద్ధితో ఆయనకు అనుకూలంగా ఉన్న ఓ మాజీ మంత్రి పీఆర్వోగా పనిచేసిన సలీం అనే వ్యక్తిని నేడు అధ్యక్షుడిగా నియమించడం తగదన్నారు.



## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

**జమ్మికుంట,మహా :** యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు, ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్లు విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ హేమలత హాజరై మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవచ్చని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని 10వ,తరగతి తోనే భవిష్యత్ కు తొలిమెట్టని అన్నారు. అదే విధంగా పదవ తరగతి లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట మండలం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు.అదే విధంగా 10/10 సాధించిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు అందజేస్తామని అన్నారు.